PRAMUKHANDHRA 29th Year of Publication We carry the news and views of Telugus

29 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర



వ్యవస్థాపకులు
శ్రీ గోపేటి శ్రీరామారావు

₹.15
జనవరి 2023



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA

# బహుముఖ ప్రజ్ఞాశాలి వి. ఎల్. దత్




ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు వి ఎల్ దత్ 85వ జయంతి సభ ఏర్పాటయ్యింది. సభలో పాల్గొన్న వక్తలు దత్ భారి పరిశ్రమల పారిశ్రామికవేత్తగా వుంటూనే ప్రపంచ తెలుగు సమాఖ్య నేర్పరచి తెలుగు భాష కు ఎనలేని సేవ చేశారని కొనియాడారు. ఎస్. పి. ప్రభాకర్ , వైస్ ప్రెసిడెంట్ సన్మార్ గ్రూప్ మాట్లాడుతూ వి ఎల్ దత్ వేలాదిమందికి ఉపాధి కల్పించే భారి పరిశ్రమల నేర్పరచటమే కాకుండా వందలాదిమంది పారిశ్రామికవేత్తల ఎదుగుదలకు కారణమయ్యారని మంచి స్నేహశీలి , తెలుగు సంస్కృతి సంప్రదాయలపట్ల మక్కువ ఎక్కువని అన్నారు. బ్రహ్మయ్య కంపెని కుమార్ మాట్లాడుతూ కె సి పి సంస్థతో తనకున్న చిరకాల అనుబంధం గూర్చి చెప్పారు. పెట్టుబడుదారుల క్షేమంకోసం అహర్నిశలు కృషి చేసేవారని , ఉద్యోగుల పట్ల ఎంతో ఆప్యాయతగా వ్యవహరించేవారని తెలిపారు.

ఇదే సభలో నేను మట్లాడుతూ దత్ గారితో మా (నాన్న గారివి , నావి) ప్రముఖాంధ్ర జ్ఞాపకాలను పంచుకున్నాను. ప్రపంచ తెలుగు సమాఖ్య ఆవిర్భావ సభలోనే ప్రముఖాంధ్ర కుడా ప్రారంభింపబడింది , ప్రముఖాంధ్ర పత్రిక విడుదల మూడు వేల కాపీలుకు ఎంతవుతుందో కనుక్కుని దత్ గారే కె సి పి సంస్థ ప్రకటన ఇచ్చి వెంటనే చెక్కునిచ్చి ,ఆయన చేతుల మీదుగానే మొట్టమొదటి ప్రముఖాంధ్ర సంచిక విడుదలవ్వటానికి కారకులయ్యారు.ఆయన హస్తవాసి మంచిది. దత్ మంచి ఆజానుబాహువు. ఆయన ఫుల్ సూట్ వేసినా , అచ్చ తెలుగు పంచె కట్టు కట్టినా కడు ఆకర్షణీయంగా కనపడతారు. ముఖ్యంగా అంత పెద్ద సంస్థలను నడుపుతూ ఎప్పుడు ఖాళీ సమయం అంటూ దొరకని ఆయన తెలుగు భాషపై మక్కువతో మన భాష అంతరించిపోకూడదని ప్రపంచ తెలుగు సమాఖ్య ను స్థాపించి ప్రపంచంలోని తెలుగువారినందరిని ఒక వేదిక మీదకు తీసుకు వచ్చిన ఖ్యాతి ఆయనది. గర్వం లేని వ్యక్తి . అలాగే ప్రస్తుతం ఇందిరాదత్ అధ్యక్షతన నడుస్తున్న ఈ సమాఖ్యకు మనమందరం దత్ గారి ఆశయాలకు తగట్టుగా మనవంతు కృషి చెయ్యాలని అదే మనం దత్ గారికి అందించే ఘన నివాళి అని తెలిపాను. ఇందిరా దత్ స్పందిస్తూ మరపురాని మనిషి దత్ అంటూ ఆయనతో తమ అనుబంధాలని పంచుకున్నవారందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సభకు స్వాగతోపన్యాసాన్ని డాక్టర్ శివరామప్రసాద్ . వందన సమర్పణ శ్రీలక్ష్మి మోహన్ రావు చేశారు. పలువురు ప్రముఖులు , సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.




# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జనవరి 2023

సంపుటి : 29 **338** సంచిక : 1




**ఆకలితో అలమటించే ప్రాణి ఉండరాదు! ఆహార కొరతలేని జగత్తుగా విశ్వం వర్ధిల్లాలి!**

# అన్నము పరబ్రహ్మ స్వరూపము

**- అన్నము పెట్టు వారికెన్నటికీ ఆహారప్పు లోటురాదు! -**

**అర్థరాత్రి వచ్చిన అతిథికి కూడా అన్నము వండి పెట్టే తల్లి డొక్కా సీతమ్మ వంటివారు లేరు!**

గోదావరి అక్విడెక్టు ప్రాంతంలోని పశ్చిమగోదావరి గన్నవరం వద్ద డొక్కా సీతమ్మగారనే నిరతాన్నదాత ఉండేవారు. అన్నార్తులను ఆదరించి భోజనం పెట్టడం ఆమె నిత్యకృత్యం. అర్ధరాత్రి సమయంలో కూడా ఆవిడ చేతిలో లాంతరు పట్టుకుని అక్విడెక్టు వద్దకు వెళ్ళి, అన్నార్తులున్నారాయని చూచి, ఇంటికి తీసుకుని వెళ్ళి వండి భోజనం పెట్టేది. అన్నార్తుల పట్ల ఆవిడకున్నంత జాలి హృదయం మరెవరికీ లేదనే చెప్పాలి. క్షుద్బాధ తీర్చుకున్న ఎంద రెందరో సీతమ్మగారి అన్నదాన నిరతిని ఎంతెంతో గొప్పగా చెప్పుకునేవారు.

ఒకసారి ఒక దొంగ, సీతమ్మగారింట్లో ఎంతో ధనమూ, ధాన్యమూ ఉండి ఉంటుంది దోచుకుందామనెడి ఆశతో వెళ్ళాడు. ఆమె వాణ్ణి అక్కడ కూర్చోబెట్టి అప్పటికప్పుడు అన్నం వండి పెట్టింది. దీపానికి అన్నం చూపిస్తూ, వాణ్ణి తినమన్నది. "ఇలా ఎందుకు చేస్తున్నావ్ అవ్వా" అని వాడు అడిగాడు!

"నాయనా! నీవు దీర్ఘకాలమూ అన్నపానాలకు లోటు లేకుండా ఆరోగ్యంగా జీవించాలని దీపజ్యోతిని ప్రార్థిస్తున్నాను, నాయనా"! అనగానే వాడి హృదయం కదిలిపోయింది. 'దొంగతనానికి వచ్చిన నన్ను ఇలా దీవించావా తల్లీ' - అంటూ ఆమె పాదాలకు నమస్కరించి వెళ్ళాడు.

దొంగను కూడా సన్మార్గవర్తనునిగా చేయగల జాతి మనది తెలుగుజాతి.

దొంగను కూడా సత్యం చెప్పమనిన సత్యబోధక చిత్రాలను నిర్మించిన వారు కూడా మనవారే! ఆనాడు 'సత్యమే జయం' చిత్రాన్ని నిర్మించిన వారూ, నటించినవారూ కూడా తెలుగువారే!

ఆనాటి చలన చిత్రాల ద్వారా దర్శకులు నీతిని బోధించేవారు. ఎన్ని కష్టాలు వచ్చినప్పటికినీ సత్యం తప్పని హరిశ్చంద్రుని కథ తెలుగువారికి శిరోధార్యం! మహాత్మాగాంధీ సహితమూ సత్యహరిశ్చంద్రుని కథ విని ముగ్ధుడయ్యాడు; సత్యం వినా వేరు సన్మార్గం లేదని విశ్వసించాడు. పురాణాలు కూడా సత్యం వినా వేరు ధర్మం లేదని బోధించాయి.

'సత్యం వద ధర్మం చర' అని ఆనాడు అన్నా ధర్మ సత్రాలలోనూ, ధర్మనిలయాల లోనూ బోధించారు. నీవు ధర్మాన్ని ఆచరిస్తే, ధర్మం నిన్ను రక్షిస్తుందనే లిఖిత ఫలకాలను గోడలకు అతికించేవారు.

నిరతమూ సత్యము పలికే పాండవాగ్రజునికి ధర్మరాజు అనే పేరును పెట్టారు. ఆయన నోట వచ్చే ప్రతి మాటలోనూ సత్యం, ధర్మం ఉండేవి. ఒకసారి ఆయనచే అసత్యం పలికించాల్సి వచ్చినపుడు "అశ్వద్ధామ హతః - అని గళమెత్తి పలుకుతూ- కుంజరహః" అని మెల్లిగా చెప్పించారు. అప్పుడు కాని కురుక్షేత్ర సంగ్రామ తీవ్రత సన్నగిల్లలేదు.

**సత్యము ఎవరినోట పలుకబడుతుందో, ధర్మం కూడా వారి వలనే నిలుస్తుంది.**

**సత్యం వద- సత్యం పలుకుము; ధర్మం చర- ధర్మంగా చరించుము అన్నది భరత వర్ష ధర్మము.**

**భరత వర్షే భరతఖండే అని ధర్మ కార్యం ప్రారంభించే ముందు ప్రారంభపదంగా చెప్పుకోబడింది.**

**భరతఖండ ధర్మమే విశ్వధర్మానికి కారణమైంది, విశ్వశాన్తికి మూలాధారమైంది.**

**సర్వజనాస్సుఖినో భవన్తు అంతర్యార్థాన్ని అంతరంగంలో ప్రతిష్ఠించుకుందాం.**



శాన్తిరస్తు, సుస్థిరస్తు । సర్వేజనా సుఖినోభవన్తు । తదాస్తు

బుధజన విధేయుడు

**- గోటేటి శ్రీరామారావు**

**(ఆగస్టు 2017)**


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# తిరుమల వేంకటేశ్వరుని పంచ రూపాలు

తిరుమల వేంకటేశ్వరుని ఆలయంలో మూలవిరాట్టు కాకుండా, మరో నాలుగు మూర్తులు ఉన్నాయి. ఈ మూర్తులు వరుసగా.

**భోగ శ్రీనివాసమూర్తి,**

**ఉగ్ర శ్రీనివాసమూర్తి,**

**మూలమూర్తి,**

**కొలువు శ్రీనివాసమూర్తి,**

**శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వాములు.**

ఏయే రూపాల ప్రాధాన్యత ఏమిటో తెలుసుకుందాం.

## మూలమూర్తి (ధ్రువబేరం) :

నిత్యం లక్షలాదిమంది భక్తిప్రపత్తులతో దర్శించుకునే మూలవిరాట్టును ధ్రువబేరం అంటారు. ధ్రువ అంటే స్థిరంగా ఉండేది అని అర్థం. ధృవబేరం అంటే నేలలో స్తంభం పాతుకున్నట్లు స్థిరంగా ఉండే విగ్రహమూర్తి. మూలవిరాట్టు అయిన ధ్రువబేరానికి తెల్లవారుజామున సుప్రభాతసేవ మొదలు, అర్ధరాత్రి ఏకాంతసేవ వరకూ రోజంతా ఆరాధనలు జరుగుతాయి. ఈ మూలవిరాట్టు సాలగ్రామమూర్తి. మూలమూర్తి శిరస్సు నుండి పాదం వరకూ ఎనిమిది అడుగుల ఎత్తులో ఉంటుంది. 'వీరస్థానక' పద్ధతిలో నిలబడి ఉన్న మూలవిరాట్టు పక్కన శ్రీదేవి, భూదేవి విగ్రహాలు ఉండవు. నిత్యం లక్షలాదిమంది భక్తులు తిరుమలేశుని దివ్య మంగళ దర్శనం కోసం ఎదురుచూస్తారు కనుక ఈ మూలవిరాట్టును (ధృవబేరం) దర్శించుకోడానికి రెండు క్షణాల కంటే సమయాన్ని కేటాయించలేరు.

## భోగ శ్రీనివాసమూర్తి (కౌతుకబేరం):

ఒక అడుగు ఎత్తులో ఉండే భోగ శ్రీనివాసమూర్తిని వ్యవహారంలో భోగ శ్రీనివాసుడు అంటారు. ఇంకోరకంగా కౌతుక బేరం లేదా పురుష బేరం అంటారు.



భోగ శ్రీనివాసమూర్తి



ఉగ్ర శ్రీనివాసమూర్తి

నిత్యం జరిపే దీపారాధన, నైవేద్యం, అభిషేకం, ఏకాంత సేవలు భోగ శ్రీనివాస మూర్తికి జరిపిస్తారు. ఈ వెండి శ్రీనివాసుని విగ్రహాన్ని క్రీస్తుశకం 614లో పల్లవ మహారాణి సామవాయి పేరిందేవి ఆలయానికి సమర్పించినట్లు శాసనాల్లో ఆధారాలు లభించాయి. మహారాణి ఈ శ్రీనివాసమూర్తిని సమర్పించిన నాటి నుండి నేటివరకూ ఎన్నడూ ఆలయం నుండి విగ్రహాన్ని ఆలయం నుండి తొలగించలేదు. ఆగమ శాస్త్రాన్ని అనుసరించి మూలవిరాట్టుకు చేసే సేవలు భోగ శ్రీనివాస మూర్తికి అందుతాయి.

## ఉగ్రశ్రీనివాసమూర్తి (స్నపనబేరం)

ఉగ్ర శ్రీనివాసమూర్తిని స్నపన బేరం అంటారు. ఈ మూర్తి శ్రీదేవి, భూదేవి సమేతంగా ఉంటుంది. నిజానికి శ్రీనివాసమూర్తి రూపం 11వ శతాబ్దం వరకూ ఉత్సవ విగ్రహంగా ఉండేది. క్రీస్తుశకం 1330లో ఒకసారి ఉత్సవ విగ్రహంగా ఊరేగింపు జరుపుతుండగా అగ్నిప్రమాదం సంభవించింది. దాంతో, అది ఉగ్ర శ్రీనివాసుని రూపానికి సంకేతంగా భావించారు. అప్పటినుంచి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప రూపాన్ని ఉత్సవ విగ్రహంగా రూపొందించారు. ఆవిధంగా అగ్ని ప్రమాదం జరిగినప్పటినుంచి ఉగ్ర శ్రీనివాస మూర్తిని సంవత్సరానికి ఒకసారి సూర్యోదయానికి ముందు సర్వ అలంకారాలతో సుందరంగా తీర్చిదిద్ది ఊరేగింపుకు తీసుకెళ్ళి, తిరిగి అంతరాలయానికి తీసుకొస్తారు.

## శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి (ఉత్సవబేరం):

13వ శతాబ్దంలో ఉగ్ర శ్రీనివాసమూర్తిని ఊరేగింపుకు తీసికెళ్ళడం మానేసిన తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామిని ఉత్సవ వేడుకల్లో ఊరేగిస్తున్నారు. ఈ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామిని ఉత్సవబేరం



శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి



కొలువు శ్రీనివాసమూర్తి

అంటారు. ఈ మూర్తి మూడు అడుగుల ఎత్తు ఉంటుంది. బ్రహ్మోత్సవాలతో సహ ప్రతి ఉత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామినే ఊరేగిస్తారు.

**కొలువు శ్రీనివాసమూర్తి (బలిబేరం):**

గర్భగుడిలో మూలవిరాట్టు పక్కన ఉండే మరొక చిన్న విగ్రహాన్ని కొలువు శ్రీనివాసమూర్తి అంటారు. ఆగమ పరిభాషలో బలిబేరం అంటారు. మూలవిరాట్టుకు తోమాలసేవ నిర్వహించిన తర్వాత కొలువు శ్రీనివాసుని బంగారు సింహాసనంపై ఉంచి పంచాంగ శ్రవణం చేస్తారు. తిరుమలలో ఆవేళ జరిగే ఉత్సవ వేడుకలు ఏమైనా ఉంటే వాటి వివరాలను తెలియజేస్తారు. శ్రీవారి హుండీలో గతరోజు వచ్చిన కానుకల వివరాలను, ఆదాయ, వ్యయాలను తెలియజేస్తారు.

మూడు గంటలు తిరుమలలో మొదటి గంట నైవేద్యం సుప్రభాతసేవ, అభిషేకాలు, కొలువు, సహస్రనామార్చనల తర్వాత శయన మంటపాన్ని శుభ్రం చేసి బంగారు వాకిలి తలుపులు మూస్తారు. తిరుమామణి మంటపంలో రెండుసార్లు గంటలు మోగిస్తారు. ఇలా తిరుమామణి మంటపంలో గంటలు మోగగానే అర్చకులు స్వామివారికి తొలి నైవేద్యం సమర్పిస్తున్నట్లు ప్రకటిస్తారు. జీయంగారు లేదా ఆయన సహాయకుడు వైష్ణవ సంప్రదాయంలోని ప్రబంధ అధ్యాయాలను పఠిస్తారు. దీన్ని సట్టుమురా అంటారు. వేంకటేశ్వరుని ముందు మెట్టుకు ఇవతలి నుండి నైవేద్యం పెడతారు. స్వామివారికి నైవేద్యంగా పులిహోర, దద్దోజనం, లడ్డూలు, వడలు, పొంగలి, చక్రపొంగలి, అప్పాలు, పోళీలు నివేదిస్తారు. నైవేద్యం స్వామివారికే కాకుండా విష్వక్సేనుడు, గరుడుడు, నిత్యాసురులకు కూడా నివేదిస్తారు. ఇలా గంటలు మోగించి, నైవేద్యం సమర్పించడాన్ని వ్యవహారంలో మొదటి గంట లేదా ఆలయ మొదటి గంట అంటారు.

తిరుమలలో రెండో గంట, అర్చన తిరుమలేశుని దేవాలయంలో అష్టోత్తర శతనామార్చన తర్వాత రెండో గంట మోగిస్తారు. ఈ సంప్రదాయాన్ని రెండో గంట లేదా అపరాహ్న పూజ అంటారు. ఇలా రెండో గంట మోగించినప్పుడు స్వామివారికి రెండోసారి నైవేద్యం సమర్పిస్తారు. రెండోసారి జరిగే ఈ అర్చనలో 'వరాహపురాణం' లోని శ్రీ వేంకటేశ్వరుని నామావళిని జపిస్తారు. పోటు నుండి తెచ్చిన అన్నప్రసాదాలు, పిండివంటలు స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఆనక తాంబూలం సమర్పించి, కర్పూరహారతి ఇస్తారు.

తిరుమల వేంకటేశ్వర ఆలయంలో రెండో గంట మోగినప్పుడు చేసే అష్టోత్తర నామార్చనను చూసేందుకు భక్తులను అనుమతించరు. ఇది ఏకాంత సేవ. ప్రత్యేక సేవలకోసం టికెట్లు కొనుక్కున్న భక్తులు నివేదించిన 'చెరుపులు' (పులిహోర, దద్దోజనం), 'పన్యారాలు' (లడ్డూలు) మొదలైన నైవేద్యాలను తిరుమల వేంకటేశ్వరునికి సమర్పిస్తారు. భక్తులు తెచ్చిన దాంట్లో నుండి కొంత మాత్రమే వేంకటేశ్వరునికి సమర్పించి, తక్కిన పదార్థాలను వారికి తిరిగి ఇచ్చేస్తారు.

తిరుమలలో మూడో గంట తిరుమల వేంకటేశ్వర ఆలయంలో ఉదయం జరిపే తోమాలసేవ, రాత్రిపూట కూడా జరుపుతారు. ఆ సేవ అనంతరం స్వామి వారికి హారతి ఇచ్చి అష్టోత్తర శతనామార్చన చేస్తారు. శ్రీదేవి, భూదేవి మూర్తులకు లక్ష్మీ నామార్చన జరుపుతారు. ఆ సమయంలో మూడో గంట మోగిస్తారు. అప్పుడు నైవేద్యాన్ని సమర్పిస్తారు. అనంతరం సర్వదర్శనం తిరిగి ప్రారంభమౌతుంది. ●

# అనంత కాలం అంటాం! కాలం విలువనెరుగం!!
# ఆదిఅంతముల్లేని కాలగర్భాన్ని చీల్చుకుని వచ్చాం!!

ఆత్మగౌరవాన్ని అదుపులోకి తీసుకుని వచ్చామా?. వచ్చిన మనం మాయా కల్పితమైన దేశకాల చిత్రీకృత వైచిత్రంలో సమదృష్టితో వ్యవహరిస్తున్నామనీ అనలేం! ద్వంద్వ దృష్టీభూతులమనీ చెప్పలేం. మన ప్రాచీనుల మార్గదర్శనంలో నడుస్తున్నామా? అదీ లేదు. సంతోషమందుతున్నామా? దౌఖితులమవుతున్నామా? అదీ తెలియదు.

ఒకతరి సంతోషం. వేరొకతరి దుఃఖం. మరియొకసుఖం. ఇంకొక తరి కష్టం. ఎలుగెత్తి ఏమన్నా ప్రయోజనమా? అది కంఠశోషేయవుతుంది.

భవితనుంచి గతంలోకీ వర్తమానంలోకీ కాల ప్రవాహవేగం యెలా ఉందని కూడా తర్కించుకోము. తర్కించుకునే సమయమూ ఉండదు. నవనాగరికం నాజూకుకదా అని అనుకుందామంటే అందుబాజు పట్టిన భావాలు రుగ్మతలై కూర్చుంటున్నాయ్. పాత చెట్లకు క్రొత్త చివుళ్ళు పూస్తున్నాయేగాని మనిషి ఊసుల్లో, ఊహల్లో, ఉద్యమాల్లో వృద్ధి వినాశనం, క్షామం– కామం, విప్లవం– విశ్వశాంతి చిన్న కుటుంబం– ఏడంతస్తుల ఆవాసం– ఇవే తక్క వేరు ఆలోచనలు వుండవు.

**వేర్పాటు ధోరణి, విభజనా ధోరణిలే ధరణియందు విరబూస్తున్నవి.**

అనంతమైనదీ, ఐశ్వర్యవంతమైనదీ భూతకాలమనీ, విశేషమైనది భవిష్యత్కాలమనే ఆశాభావం కలగడం లేదు. వర్తమాన కాలం స్వార్థపూరిత వ్యర్థమైనదని నిరాశ, నిస్పృహలు పడుతూ, నిందారోపణలు చేసుకుంటూ ఉంటే సుఖం వచ్చి ఒడిలో కూర్చుంటుందా? **దైవ రూపంబు కాలంబు దానికెపుడు లోటు కలుగదు మన బుద్ధి లోపంబుగాని–** యని పానుగంటివారు చెప్పినట్లు– మనం మంచిగా మసలుతూ కాలంబు మహనీయమైనదని– అది దైవరూపంబనే పవిత్రభావన మనలో కలిగిననాడు అంతటా, అంతఃకరణలోనూ మంచే కలుగుతుంది కానీ ఆ 'మంచి' సుదూరమయ్యింది. చదువులందుగానీ, సభలయందుగానీ కనబడడం లేదు. దొందూదొందేయన్న మనుజభవులు ప్రభువులువుతున్నారనా– రామవిభుడు పుట్టి రఘు కులంబలరించె కురు విభుడు పుట్టి కులము చెరిచె– అని వేమన కవి చెప్పిన పద్యములోని పై రెండు పాదముల భావమే యీనాడు నాడు నాడంతా ప్రభవిస్తున్నది.

రామచంద్రుడూ ప్రభువే! కురువంశసార్వభౌముడైన దుర్యోధనుడూ ప్రభువే! రామరాజ్యాన్నే అందరూ ధర్మరాజ్యం అన్నారు. ఆ రామరాజ్యాన్నే ఆదర్శంగా చేసుకుని ప్రజాస్వామ్యం పుట్టింది. అంతేకాని కురుసార్వభౌముడైన దుర్యోధను న్నెవరూ ఆదర్శంగా తీసుకోలేదు. విశ్వంలోని పలుదేశాలవారు రామాయణమును తమ భాషల్లో అనువదించుకొని, ఆదరించడమే కాకుండా, ఆదర్శ రాజ్యాంగాన్ని రచించుకున్నారు. భారతరాజ్యాంగం కూడా శ్రీరాముని ఆదర్శ రామరాజ్యాంగమే. బౌద్ధమతం స్వీకరించిన అంబేత్కర్, మక్కాలో జన్మించి మన దేశ పౌరసత్వం స్వీకరించి, కేంద్ర ప్రభుత్వంలో తొలి విద్యామంత్రియైన మౌలానా అబుల్‌కలాం ఆజాద్ నుంచీ– నేటి పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వరకూఅదే బాటలో నడవాలన్నారు. పాకిస్థాన్‌లో ఉండే సరిహద్దుగాంధీగా పిలువబడిన ప్రముఖ నాయకుడు ఖాన్ అబ్దుల్ గఫూర్‌ఖాన్ అదే బాటను అనుసరించారు. ఆఫ్రికా నాయకుడు నెల్సన్ మండేలా కూడా అదే బాటలో నడిచారు. అమెరికాలోని మార్టిన్ లూథర్ కింగ్, అబ్రహాం లింకన్ ఆ బాటలోనే పయనించారు. పేరుకు గాంధీ మార్గమూ, గాంధీపుట్టిన దేశమే, నెహ్రూగానీ ఎవరూ సత్య అహింసల మార్గాన్ని అనుసరించలేదు.

కాంగ్రెస్ పార్టీ మూలకర్త తెల్లవారి బిడ్డ అనీబిసెంట్ ధర్మమార్గాన్ని ఎవరు నడిచారు. గాంధీ వంశీయులెవరూ రాజకీయంలోకి రానూలేదు. వచ్చినవారు గాంధేయులు కాదు.

గాంధీ వంశజుడు గాకపోయినా రాజీవ్‌గాంధీ మెరుగనిపించాడు. భారతదేశాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేయాలనెడి తపన పడ్డాడు. ఇతరగాంధీల్లో ఏ కోశాన చూచినా– ఏ గాంధీతత్వమూ లేదు. పి.వి. నరసింహారావు కాంగ్రెస్ పరపతి నిలిపినా ఆయన్ను సూదిలో నున్న దారాన్ని తీసినట్టు తీసిపారేశారు.

ఇలా జరుగుతుందని, మహాత్మాగాంధీ ముందే ఊహించి, స్వాతంత్ర్య సమర విజయ శంఖం ఊదిన కాంగ్రెస్ అధికార పీఠం అధిష్టించవలదన్నారు.

పట్టాభి సీతారామయ్య నుంచీ, నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి వరకూ ఆత్మగౌరవం కోసం పాకులాడిన ప్రకాశం పంతులు గారిలా, సర్వస్వమూ త్యాగం చేసిన వారేరీ? కామరాజులా నిరాడంబరంగా జీవించిన వారేరీ? అంటే సమాధానం రాదు– కావున ఆత్మగౌరవం సర్దుకుపోవాలి! ●

# ధర్మాత్ముడు

ఓ రాజుకు నలుగురు కొడుకులు ఉండేవారు. "ఎవడైతే సర్వాధికుడైన ధర్మాత్ముణ్ణి వెతికి తీసుకువస్తాడో అతడికే రాజ్యాధికారం ఇస్తాను" అన్నాడు ఆ రాజు తన కొడుకులతో.

రాకుమారులు నలుగురూ తమ గుఱ్ఱాలు తీసుకుని నాలుగు దిక్కులకూ బయలుదేరారు.

కొన్నాళ్ల తర్వాత పెద్ద కొడుకు తిరిగి వచ్చి తండ్రికి ఎదురుగా ఓ వ్యాపారిని నిలబెట్టి, "ఈ శేర్ గారు వేలాది రూపాయలు దానం చేస్తుంటారు. ఎన్నో గుళ్లూ గోపురాలు కట్టించారు. చెరువులు తవ్వించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. తీర్థక్షేత్రాలలో ఎన్నో వ్రతాలు చేస్తుంటారు. నిత్యం పురాణ శ్రవణం చేస్తుంటారు. గోపూజలు చేస్తుంటారు. ప్రపంచంలో వీరిని మించిన గొప్ప ధర్మాత్ముడెవరూ ఉండరు." అన్నాడు.

'ఈయన నిశ్చయంగా ధర్మాత్ముడే!'అని పలికిన రాజు, ఆ వ్యాపారిని సత్కరించి పంపివేశాడు.

రెండవ కొడుకు ఓ బక్కచిక్కిన బ్రాహ్మణుడిని తీసుకువచ్చి "ప్రభూ! ఈ బ్రాహ్మణుడు నాలుగు ధామాలకు, సప్తపురాలకు కాలినడకన వెళ్లి యాత్రలు చేసివచ్చాడు. సదా వీరు చాంద్రాయణ వ్రతం చేస్తుంటారు. అసత్యానికి వీరు భయపడతారు. ఈయన కోపగించడం ఎవరూ, ఎన్నడూ చూడలేదు. నియమబద్ధంగా మంత్ర జపాదులు పూర్తి చేసుకున్న తరువాతే జలపానం చేస్తారు. త్రికాలాల్లోనూ స్నానం చేసి సంధ్యావందనం చేస్తారు. ఈకాలంలో యీవిశ్వంలో వీరిని మించి సర్వశ్రేష్ట ధర్మాత్ములెవరూ లేరు." అన్నాడు.

రాజు బ్రాహ్మణునకు నమస్కరించి అధిక దక్షిణలిచ్చి, వీరు మంచి ధర్మాత్ములే అంటూ పంపివేశాడు.

మూడవ కొడుకు కూడా ఒక బాబాజీని తీసుకొని వచ్చాడు. ఆబాబాజీ వస్తూనే ఆసనం వేసుకుని కళ్ళు మూసుకుని కూర్చుండి పోయారు. జీర్ణమైన బట్టలతో అస్థిపంజరంలా ఉన్న ఆకారంతో ఆయన కనిపిస్తున్నాడు. అందరూ ఆసీనులైన తరువాత మూడవ కొడుకూ "ప్రభూ! వీరు ఎంతగానో నేను ప్రార్థించగా ఇక్కడకు విచ్చేశారు. వీరు మహా తపస్వులు. వారానికి ఒక్కసారి మాత్రమే క్షీరపానం చేస్తారు. గ్రీష్మ ఋతువులో పంచాగ్ని మధ్యంలో ఉంటారు. శీతాకాలంలో జలాలలో నిలబడతారు. సదా భగవంతుని ధ్యానంలో వుండే వీరికి మించిన మహా ధర్మాత్ములు లభించడం దుర్లభమే..." అన్నాడు.

రాజు ఆ మహాత్మునికి సాష్టాంగ ప్రణామం చేసి వారి ఆశీస్సులు అందుకుని వీడ్కోలు పలికాడు.. ఆపై వీరు ధర్మాత్ములే అన్నాడు.

అందరి తరువాత చిన్నకొడుకు వచ్చాడు. అతనితో మాసిన బట్టలు కట్టుకున్న పల్లెలో నివసించే ఓ రైతు ఉన్నాడు. దూరం నుండియే రాజుకు దండాలు పెడుతూ భయపడుతూ ఆ రైతు వచ్చి నిలబడ్డాడు. అన్నలు ముగ్గురూ తమ్ముని మూర్ఖత్వానికి పకపక నవ్వారు. అప్పుడా చిన్నకొడుకు "ప్రభూ! ఓ కుక్కకు గాయం అయ్యింది. ఇతను అది చూసి దాని గాయం కడిగాడు. అందుకే నేనితణ్ణి తీసుకువచ్చాను. ఇతడు ధర్మాత్ముడవునో కాదో మీరే అడిగి తెలుసుకోండి" అన్నాడు.

రాజు "ఏమయ్యా! నువ్వు ఏం ధర్మం చేస్తుంటావు?"

భయపడుతూనే రైతు పలికాడు "ప్రభూ! నేను చదువుకున్నవాణ్ణి కాను. నాకు ధర్మం అంటే ఏం తెలుస్తుంది, ఎవరైనా జబ్బుపడితే సేవ చేస్తాను. ఎవరైనా యాచిస్తే గుప్పెడు మెతుకులు పెడతాను"

అంతట రాజు, "ఇతడే అందరికన్నా గొప్ప ధర్మాత్ముడు" అన్నాడు.

అది విని కొడుకులందరూ అటూ ఇటూ చూడసాగారు. రాజు అప్పుడు, "దాన ధర్మాలు చేయడం, గోపూజ చేయడం, అసత్యమాడక పోవడం క్రోధంగా ఉండక పోవడం, తీర్థయాత్రలు, సంధ్యావందనం పూజాదులు కొనసాగించడం కూడా ధర్మమే. తపస్సు చేయడం ఆవశ్యకమైన ధర్మమే, కానీ సర్వాధిక ధర్మమేమంటే అర్థించక పోయినా అసహాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవడం, రోగికి సేవ చేయడం, కష్టంలో ఉన్న వారికి చేయూతనీయడం సర్వాధికమైన ధర్మం. పరులకు సహకరించే వారికి తనంతతానుగా సహాయం అందుతుంది. త్రిలోక నాథుడైన పరమాత్మ అట్టి పరోపకార పరాయణునిపై ప్రసన్నుడై ఉంటాడు" అని అన్నాడు.

అందుకే పరోపకారం అన్నింటికన్నా మించిన ధర్మం. అది నిర్వర్తించే వాడే ధర్మాత్ముడు.

Beautiful City - Beautiful Hotel

DO NOT MISS



Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

# ఆధ్యాత్మిక సాధన

ఆధ్యాత్మిక సాధన అంటే మనని మనం ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకువెళ్లే అంతరంగ సాధన.

దీనికి మన బాహ్య పరిస్థితులతో, మన భౌతిక స్థితితో సంబందం లేదు. మన మతము, కులం, లింగం (ఆడా, మగ), వయస్సు వీటితో సంబంధం లేదు. కేవలం అంతరంగ మార్పు కావాలి అన్న పట్టుదల ఒకటి ఉంటే చాలు వారు ఈ సాధనకు అర్హులు.

దీనికి బాహ్య గురువు ఉండడు. బయట నుంచి ఎవ్వరు మనని నియంత్రించరు. అస్సలు ఈ సాధన చేస్తున్నామని ఎవ్వరికి తెలియదు. కానీ సాధనా పరిమళాలు అందరిని ఆకర్షింపచేసి, వారిని కూడా ఈ సాధనకు ప్రేరణ చేస్తాయి. కాబట్టి ఈ సాధనకు ఏటువంటి ప్రచారా ఆర్భాటాలు లేవు.

ఆధ్యాత్మిక సాధనకు కావాల్సిన కొన్ని లక్షణాలు...

1) స్వప్రయత్నం
2) స్వయం క్రమశిక్షణ
3) స్వ అధ్యయనం
4) స్వ పరిశీలన
5) స్వ లక్ష్య నిర్ణయం
6) సమయ పాలన
7) పోల్చుకోక పోవడం
8) అనాసక్తి
9) మౌనం
10) ఎల్లలు లేని ప్రేమ
11) ఎవరినైనా మనస్ఫూర్తిగా క్షమించడం
12) అన్ని వాస్తవాలని యథాతథంగా స్వీకరించడం
13) కర్మని బట్టి సర్వం జరుగుతాయి కాబట్టి "చేసుకున్నవాడికి చేసుకున్నంత" అని గ్రహించడం
14) మన వాస్తవానికి మనమే సృష్టి కర్త అని గ్రహించి కావాల్సిన వాస్తవాలను సృష్టించుకోవడం
15) నిత్యము, సత్యము, శాశ్వతం వీటిని గురించి విచారణ, విశ్లేషణ చేయడం
16) మార్పు సహజం అని గుర్తించి దానిని ఆహ్వానించడం
17) అహంకారమును పూర్తిగా తొలగించడం
18) మమకారం ని ఆదిలోనే తుంచడం
19) తాను అందరికంటే అధికుడను అన్న భావం రానివ్వకుండా జాగ్రత్తగా ఉండడం
20) సదా ఎరుకలో ఉండడం
21) భౌతిక, ఆధ్యాత్మిక, మతముల పై పూర్తి అవహాగన కలిగి ఒక దానితో ఇంకొకటి కలిపి కలగాపులగం చేయకపోవడం
22) అలవాట్లు, వ్యాసనాలు, సంప్రదాయాలు, సంస్కారాలు, వాసనలు వీటి గురించి పూర్తి అవహాగన కలిగి సరియైనవి ఎన్నిక చేసుకోవడం
23) అంతరంగ శుద్ధి కలిగి ఉండడం, దాని కోసం సాధన చేయడం
24) అహం నాస్తి, ఇదం నమమ అన్న భావాలని అవహాగన చేసుకొని జీవించడం
25) మనచే ఆచరింప బద్ధ సర్వ కర్మ ఫలితాలు పరమాత్మకు ప్రతి నిత్యం ప్రయత్నపూర్వకంగా సమర్పణ చేయడం
26) దేని చేత బందింపబడక నిత్య ముక్త స్థితిలో ఉండడం..

# భగవత్ తత్వం

అనగనగా ఒక రాజ్యం. ఆ రాజుకు చక్కని పరిపాలకుడిగా పేరు. సిరిసంపదలతో తులతూగుతూ దేశం సుభిక్షంగా ఉండేది. రాజుకు ముగ్గురు భార్యలు. ముసలితనంలో మరో భార్యను పెళ్లాడాడు. నలుగురితో సుఖంగా, జీవితమంతా సందడిగా గడిచింది. చనిపోయేనాటికి ఒంటరిగా పోవడమెలా అన్న బెంగ పుట్టింది. భార్యలను తోడుగా తీసుకెళ్ళాలన్న ఆలోచన కలిగింది.

తాను ఎంతో ప్రాణంగా చూసుకున్న పెద్దభార్యను పిలిచాడు. 'నాతోపాటు వస్తావా' అని అడిగాడు. 'రాను' అని స్పష్టం చేసిందామె. 'ఇంతకాలం నువ్వు నన్ను బాగా చూసుకున్నమాట నిజమే అయినా, ఈ విషయంలో మాత్రం నీ కోరిక తీర్చలేను' అని కుండ బద్దలుకొట్టినట్లు చెప్పిందావిడ.

రాజు రెండో భార్యను పిలిచాడు. 'ఇన్నాళ్లు నిన్ను ఎంతో ప్రేమగా చూసుకొన్నాను. నాతో రావచ్చుగా' అని అడిగి చూశాడు. ఆవిడా కాదనేసింది. 'నీ సుఖం కోసం, నీ స్వార్థం కోసం నన్ను బాగా చూసుకున్నావంతే. నిజం చెప్పాలంటే నన్ను ఉపయోగించుకొన్నావు... నీతో ఎందుకు వస్తాను' అంది.

మూడో భార్యను ఇంతకాలం పెద్దగా పట్టించుకోలేదు గాని అడిగి చూద్దామని ఆమెను మొహమాటపడుతూనే అడిగాడు. విచిత్రంగా ఆవిడ ఒప్పుకోవడమే కాదు, 'నువ్వు వద్దన్నా నీతో వస్తాను' అంటూ రాజుగారిని ఆశ్చర్యంలో ముంచెత్తింది.

రాజుకు ఆ సమాధానం విన్నాక నాలుగో భార్య అభిప్రాయం తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. చేసుకోవడమే ఆమెను తన వయసైపోయాక చేసుకొన్నాడు. ఆమెను బాగా చూసుకొనే అవకాశమూ పెద్దగా లేకపోయిందాయనకు. కాబట్టి ఆమె ఎదుట అపరాధ భావంతోనే నిలబడ్డాడు. మౌనంగా ఉండిపోయాడే తప్ప అడగలేకపోయాడు. అయితే ఆమె ఈ రాజు మనోభావాన్ని గుర్తించి ప్రేమగా ఆలింగనం చేసుకొంది. 'నన్ను నీవు అడిగే పని లేదు. నీ వెంట తప్పక వస్తాను. నీ చేతిని ఎన్నడూ విడిచిపెట్టను' అంటూ ఎంతో ధైర్యం చెప్పింది. రాజు తల దించుకున్నాడు.

చిన్నప్పుడు విన్న ఈ కథను మనం పెద్దయ్యాక జాగ్రత్తగా విశ్లేషించుకోవాలి.

ఈ కథలో మొదటి భార్య పేరు 'శరీరం'. అది మనిషి జీవించి ఉన్నంతకాలం ఎంతో సేవ చేస్తుంది. మరణంలో మాత్రం తోడు రాను పొమ్మంటుంది. మనిషిని విడిచిపెట్టి మట్టిలో కలిసిపోతుంది. రెండో భార్య 'సంపద'. మనిషి అవసరాలకోసం సంపదను వాడుకొంటాడు. చనిపోయాక పూచికపుల్ల సైతం మనిషితోపాటు రాదు. 'నీ స్వార్థం కోసం నన్ను వాడుకొన్నా'వని సంపద నిందించింది అందుకే.

మూడో ఆమె 'కర్మ'. వద్దన్నా మనిషిని వెంబడిస్తుంది. జన్మజన్మలకు వెంటాడుతుంది. ఒప్పుకోకపోయినా వస్తానని అందుకే చెప్పింది.

నాలుగో భార్యపేరు 'భగవంతుడు'. వయసు పైబడే దాకా ఆయనతో పరిచయమే చేసుకోడు మనిషి. నిజానికి అవసరమైంది ఈమెతో కలిసి ఉండటమే. అది గుర్తుకొచ్చే రాజు తల దించుకుని నిలబడ్డాడు. అయినా రాజుకు తిరుగులేని అభయం ఇచ్చిందామె. చేతిని వదలనని ధైర్యం చెప్పింది. కనీసం చివరిలోనైనా తన గురించి ఆలోచించాడని దయ చూపిందామె. అదే భగవంతుడి స్వభావం.

మనం తెల్సుకోవలసింది ఒక్కటే! ఈ అనగనగా...కథలో రాజుగారెవరు అని. ఇదే భగవత్ తత్వం.

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# శ్రీ రామకృష్ణ పరమహంస - శ్రీ స్వామి వివేకానంద మధ్య జరిగిన అరుదైన సంభాషణ



**1. స్వామి వివేకానంద: – నా జీవితం చాలా తీవ్రతరమైపోతోంది, అసలు ఖాళీ సమయము దొరకడము లేదు!**

**రామకృష్ణ పరమహంస: –** పనుల కార్యాచరణలో మీకు బిజీగా ఉంటుంది. కానీ మీ ఉత్పాదకత పెరుగుతుంది!

**2. స్వామి వివేకానంద: – నా జీవితం ఎందుకు ఇంత క్లిష్టంగా మారింది?**

**రామకృష్ణ పరమహంస: –** మీరు మీ జీవితాన్ని జీవించండి ... విశ్లేషించడం మానేయండి .. అదే జీవితాన్ని సంక్లిష్టం చేస్తుంది.

**3. స్వామి వివేకానంద: – మనం ఎందుకు నిరంతరం అసంతృప్తితో ఉంటున్నాము?**

**రామకృష్ణ పరమహంస:–** ఎపుడూ ఏదో ఒక కారణముతో విషయము గురించి చింతించడం మీకు అలవాటుగా మారింది. అందుకే మీరు అసంతృప్తి తో (సంతోషంగా లేరు) ఉంటున్నారు!

**4. స్వామి వివేకానంద:– ఎందుకు మంచి వ్యక్తులే ఎప్పుడూ బాధలకు లోనవుతూ ఉంటారు?**

**రామకృష్ణ పరమహంస:–** వ్యక్తులందరూ పరీక్షలకు గురిఅవుతూనే ఉంటారు, తద్వారా వారి వ్యక్తిత్వ ఔన్నత్యం మెరుగవుతూ ఉంటుంది. ఘర్షణ లేకుండా వజ్రాన్ని సాన పెట్టలేము. అగ్ని లేకుండా బంగారాన్ని శుద్ధి చేయలేము. ఆ పరీక్షలు బాధలు కాదు; వారి జీవితంను మెరుగు పర్చేవే గానీ చేదు అనుభవాలు కావు!

**5. స్వామి వివేకానంద:– అలాంటి అనుభవాలు ఉపయోగకరంగా ఉంటాయని మీరనుకుంటారా?**

**రామకృష్ణ పరమహంస:–** అవును... ప్రతి పరీక్ష ఒక స్వీయ అనుభవం మరియూ ఒక గురువు. అది మొదట కఠినమైనదిగా అనిపించినా తరువాత పాఠాలను ఇస్తుంది.

**6. స్వామి వివేకానంద: – చాలా సమస్యలు ఉన్నందున, మేము ఎక్కడికి వెళ్తున్నామో మాకు తెలియడము లేదు.**

**రామకృష్ణ పరమహంస: –** బహిర్గత దృష్టితో చూస్తే మీరు ఎక్కడికి వెళుతున్నారో మీకు తెలియదు. లోపలకి చూడండి. మీ కళ్ళు సరి అయిన దృష్టిని అందిస్తాయి, గుండె మార్గం అందిస్తుంది.

**7. స్వామి వివేకానంద: – సరైన దిశలో వెళ్ళడం కంటే వైఫల్యం ఎక్కువ బాధ కలిగిస్తుందా?**

**రామకృష్ణ పరమహంస:–** "విజయం" అనేది ఇతరులు మీగురించి నిర్ణయించే ఒక కొలమానం. సంతృప్తి అనేది మీకు మీరు నిర్ణయించుకునే కొలబద్ద.

**8. స్వామి వివేకానంద: – కఠినమైన సమయాల్లో, మీరు ఎలా ప్రేరేపించబడతారు?**

**రామకృష్ణ పరమహంస: –** మీరు ఎంత దూరం వెళ్ళాలో కాకుండా మీరు ఎంత దూరం ముందుకు వచ్చారో ఎల్లప్పుడూ సరిచూసుకోండి. మీరు పొందిన ఆశీస్సులను ఎల్లప్పుడూ లెక్కించండి, మీరు పోగొట్టుకున్నవి కాదు.

**9. స్వామి వివేకానంద: – ప్రజల గురించి మీకు ఆశ్చర్యం ఏమిటి?**

**రామకృష్ణ పరమహంస: –** వారు బాధపడుతున్నప్పుడు వారు "ఎందుకు నేనే ...?" అని అడుగుతారు. వారు అభివృద్ధి చెందుతున్నప్పుడు, వారు "నేనే ఎందుకు?" అని ఎప్పుడూ అడగరు.

**10. స్వామి వివేకానంద: – నేను జీవితంలో ఉత్తమమైనదాన్ని ఎలా పొందగలను?**

**రామకృష్ణ పరమహంస: –** మీ గతాన్ని విచారం లేకుండా ఎదుర్కోండి. మీ వర్తమానాన్ని విశ్వాసంతో నిర్వహించండి. భయం లేకుండా భవిష్యత్తు కోసం సిద్ధపడండి.

**11. స్వామి వివేకానంద: – చివరి ప్రశ్న. కొన్నిసార్లు నా ప్రార్థనలకు సమాధానం లభించదని నేను భావిస్తున్నాను.**

**రామకృష్ణ పరమహంస:–** జవాబు లేని ప్రార్థనలు ఏవీ లేవు. జీవితం పరిష్కరించడానికి ఒక రహస్యం, పరిష్కరించడానికి సమస్య కాదు.

విశ్వాసం కలిగి ఉండి భయాన్ని వదలండి. నన్ను నమ్మండి. ఎలా జీవించాలో తెలిస్తే జీవితం అద్భుతమైనది.







# సప్తఋషులు

ఈ రోజుల్లో సప్త ఋషులు మనకు కనపడతారా? అంటే ఖచ్చితంగా కనబడతారు అని చెప్పవచ్చును. ఇంకా గట్టిగా చెప్పాలంటే...అందరికీ కనపడతారు, చూడగలిగితే ప్రతీరోజూ కనపడతారు. ఇంకా చెప్పాలంటే ప్రతీ దంపతులూ సాయంత్రంపూట సప్త ఋషులకు, అరుంధతీ వశిష్ఠులకు నమస్కరించుకోవాలికూడా.

ఎక్కడ ఉంటారు? ఎలా ఉంటారు?అనేది మన పెళ్ళిళ్ళలో 'అరుంధతీ దర్శనం' చేయిస్తూ పురోహితులు తెలియజేస్తారు.

సాయంత్రం పూట ఆకాశంలో ఉత్తరం దిక్కున ప్రతీరోజూ వారిని మనం దర్శించుకోవచ్చు.

ఇంతకీ సప్త ఋషులు ఎవరు? వారి వివరాలు ఏమిటి? అంటే..

**కశ్యప అత్రి భరద్వాజ**
**విశ్వామిత్రోథ గౌతమః!**
**వశిష్ఠో జమదగ్నిశ్చ**
**సప్తైతే ఋషయః స్మృతాః!!**

భారతీయ పురాణ కథనాల ప్రకారం ప్రతివారి వంశానికి ఓ ఋషి మూల పురుషుడిగా ఉంటారు. ప్రాచీన ఋషుల వంశానుక్రమమే నేటి భారతీయ సంతతి. కొందరికి గోత్రరూపంలో వారి పూర్వ ఋషులు ప్రతిరోజూ స్మరణీయులే. మరికొందరికీ వారి పూర్వ ఋషులు తెలియకపోయినప్పటికీ వారి వంశాలకు ఋషులున్నారు.

ఎంతోమంది ఋషుల ప్రతినిధులుగా సప్తర్షులను పూజించటం ఆనవాయితీగా వస్తున్నది.

1. **కశ్యపుడు**
2. **అత్రి**
3. **భరద్వాజుడు**
4. **విశ్వామిత్రుడు**
5. **గౌతముడు**
6. **జమదగ్ని**
7. **వసిష్ఠుడు**

**వీరు ఏడుగురు పూజనీయులే.**

రాక్షసులు హరించిన భగవద్దత్తమైన వేదాలను మహావిష్ణువు వ్యాసుని రూపంలో అవతరించి ఉపనిషత్తులు, పురాణాల రూపేణా మనకందించాడు. వ్యాసుడు నాలుగు తలలు లేని బ్రహ్మ, రెండు బాహువులు గల విష్ణువు, మూడో కన్ను లేని శివుడని అంటారు.

### 1. కశ్యప మహర్షి:-

సప్తర్షుల్లో కశ్యపుడు ఒక ప్రజాపతి. 'మరీచి, కళ'ల పుత్రుడు. దక్షప్రజాపతి పుత్రికల్లో 13 మందిని, వైశ్వానరుని పుత్రికల్లో ఇద్దరిని పెళ్ళాడాడు. వారి ద్వారా దైత్యులు, ఆదిత్యులు, దానవులు, సిద్ధులు, గంధర్వులు, అప్సరసలు, మానేయులు, యక్షులు, రాక్షసులు, వృక్ష లతాతృణ జాతులు, సింహ, మృగ, సర్పాలను, పక్షులను, గోగణాలను, అనూరుడు, గరుడుడు, నాగులు, కాలకేయులను, పౌలోములను, పర్వతుడు అనే దేవర్షిని, విభండకుడు అనే బ్రహ్మర్షిని పుత్రులుగా పొందాడు.

### 2. అత్రి మహర్షి:-

సప్తర్షుల్లో రెండోవాడైన అత్రి మహర్షి బ్రహ్మ మానస పుత్రుల్లో ఒకడు. అతని భార్య అనసూయ. అత్రి తన తపోబలంతో త్రిమూర్తులను పోలిన సోమ, దూర్వాస, దత్తాత్రేయులను కుమారులుగా పొందాడు. అత్రి భార్య అనసూయ పతివ్రతా శిరోమణి.



### 3. భరద్వాజ మహర్షి:

భరద్వాజుడు ఉతథ్యుని పుత్రుడు. తల్లి పేరు మమత. బృహస్పతి కృప వలన జన్మించి, ఘృతాచీ పట్ల చిత్తచాంచల్యం పొంది, ఘటంలో ద్రోణ జన్మకు కారకుడవుతాడు.

### 4. విశ్వామిత్ర మహర్షి:-

విశ్వామిత్రుడు రాజర్షి. త్రిశంకుని స్వర్గానికి పంపడానికి కొంత తపోఫలాన్ని, హరిశ్చంద్రునిచే అసత్యమాడించి కొంత తపో ఫలాన్ని, మేనక వల్ల తపోవిఘ్నం పొంది శకుంతల జననానికి మూలపురుషుడయ్యాడు. దుష్యంతుడు, శకుంతలల పుత్రుడే భారతదేశ నామకరణానికి ఆదిగా నిలిచాడు.

### 5. గౌతమ మహర్షి:

తీవ్ర క్షామం ఏర్పడినప్పుడు ఋషులు, మునులందరికీ గౌతముడు తన తపోబలంతో భోజన వసతి కల్పించాడు. ఇతర ఋషుల ఈర్ష్య వలన మాయా గోవును దర్భతో అదిలించి, బ్రహ్మహత్యా పాతకం అంటగట్టుకొన్నాడు. ఆ దోష పరిహారం కొరకు గోదావరిని భూమిపైకి తెచ్చిన మహర్షి, తన భార్య అహల్యను శిలగా మారేటట్లు శాపమిచ్చిందీ ఆయనే.

### 6. వశిష్ఠ మహర్షి:-

ఇతని భార్య అరుంధతి. వసిష్ఠుడు బ్రహ్మమానస పుత్రుల్లో ఒకడు. వైవస్వత మన్వంతరాన సప్తర్షుల్లో ఒకడు. శక్తి మొదలైన వందమంది పుత్రులు గలవాడు. దక్ష ప్రజాపతి పుత్రిక ఊర్జ ద్వారా రజుడు, గోత్రుడు, ఊర్ధ్వబాహుడు, సువనుడు, అనఘుడు, సుతవుడు, శుక్రుడు అనే ఏడుగురు పుత్రులను పొందాడు. సప్తర్షులు తేజస్సు గలవారు కనుక వారిని పూజిస్తే సకల దోషాలు తొలగిపోతాయంటారు.

### 7. జమదగ్ని మహర్షి:-

జమదగ్ని ఋషి– 'రుచికముని, సత్యవతి'ల కుమారుడు. జమదగ్ని కుమారుడే పరశురాముడు. జమదగ్ని భార్య రేణుక మనసులో కలిగిన అన్యపురుష వ్యామోహం వలన, ఆమెను తన కొడుకైన పరశురామునిచే నరికించాడు. ఆ తరవాత పరశురాముడి ప్రార్థన మేరకు ఆమెను పునర్జీవితురాలిని చేశాడు.

మరణం ఆసన్నమైన వారికి అరుంధతీ దర్శనం, సప్తర్షి మండల దర్శనం కాదట.

మీరంతా మీకు వీలున్న సాయంత్రపు వేళ "సప్తర్షి మండల దర్శనం" చేసుకుంటే మంచిది.





# ఆముక్తమాల్యద

మనుచరిత్ర, వసుచరిత్ర, పారిజాతాపహరణం, శృంగార నైషధం, ఆముక్తమాల్యద తెలుగు సాహిత్యంలో పంచ మహా కావ్యాలుగా ప్రసిద్ధిపొందాయి.

అందులో ఆముక్తమాల్యద కావ్యాన్ని మూరు రాయర గండరుగా, విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా కీర్తిపొందిన శ్రీకృష్ణదేవరాయలవారు రచించారు. ఆముక్త మాల్యద అంటే ధరించిన పూలమాలనే సమర్పించి యిచ్చినది అని అర్థం. ఈ కావ్యం పెరియాళ్వారు, ఆండాళ్ నాచియార్‌ల కథని వివరించే గ్రంథం. ఈ గ్రంథంలో ఏడు అధ్యాయాలు వున్నాయి. మొదటి నాలుగు అధ్యాయాలలో పెరియాళ్వారు చరిత్ర, తరువాత మూడు అధ్యాయాలలో ఆండాళ్ (గోదాదేవి) చరిత్ర చెప్పబడి వున్నది. విష్ణుచిత్తుడనే పెరియాళ్వారు చరిత్ర యీ గ్రంథంలో విరివిగా చెప్పబడినందున విష్ణుచిత్తీయం అనే పేరు కూడా యీ గ్రంథానికి వున్నది.

శ్రీ కృష్ణ దేవరాయలు ఒకసారి కళింగదేశాన్ని జయించాలని సంకల్పించాడు. సేనలను సమకూర్చుకొని యుద్ధానికి బయలుదేరాడు. మార్గంలో విజయవాడలో విడిదిచేశాడు. ఒకనాడు అక్కడికి సమీపాన శ్రీకాకుళంలో కొలువై వున్న ఆంధ్ర మహావిష్ణువు ఆలయాన్ని సందర్శించడానికి శ్రీ కృష్ణదేవరాయలు వెళ్ళాడు. ఆయన ఆలయానికి వెళ్ళినది ఏకాదశి తిథి నాడు. అందువలన ఏకాదశి ఉపవాస దీక్ష వహించాడు. ఆనాటి రాత్రి శ్రీ కృష్ణదేవరాయలకి ఒక స్వప్నం వచ్చింది. శ్రీకాకుళ ఆంధ్రమహావిష్ణువు నీలమేఘశ్యాముడై తామరపుష్పాలవంటి కన్నులతో, పసుపు వర్ణ పీతాంబరాలు ధరించి శ్రీ కృష్ణదేవరాయలికి దర్శనమిచ్చాడు.

“కృష్ణ రాయా! నీవు ఇంతవరకూ పలు గ్రంథాలు వ్రాశావు. కావ్యాలంకారాలతో, భాసిస్తూ నీవు సంస్కృతంలో వ్రాసిన మదాలస చరితం, సత్యభామ చరితం, జ్ఞాన చింతామణి, రసమంజరి, మొదలైన అన్ని గ్రంథాలు కీర్తి గాంచినవే. నీ సంస్కృత పాండితీ పటిమను చూపించావు.

తెలుగు సాహిత్యంలో నీకు గల పాండిత్యాన్ని కూడా లోకానికి చూపించి మంచి పేరు తెచ్చుకోవాలి” అని ఆదేశించగా, తాను ఏ కథా వస్తువుపై కావ్యం వ్రాయాలో నిర్దేశించమని శ్రీ కృష్ణదేవరాయలు అడిగాడు.

“ఒక యువతి నామీద వ్యామోహంతో, ప్రేమతో, భక్తితో తాను ధరించిన పుష్పమాలను తిరిగి నాకు అర్పించినది. ఆమెపైగల అనురాగంతో, మేము పరస్పరం ఇష్టపడి వివాహం చేసుకున్నాము.

నాకు, ఆండాళ్‌కి జరిగిన ఆ వివాహాన్ని గురించి తెలుగులో ఒక కావ్యం వ్రాయమని ఆనతి యిచ్చాడు శ్రీ కాకుళాంధ్ర మహావిష్ణువు.

మహావిష్ణువు ఆనతిని స్వీకరించి తన ఇష్టదైవమైన తిరుమలదేవునికి అర్పించ డానికి ఆముక్తమాల్యద కావ్యాన్ని తెలుగులో వ్రాయ సంకల్పించాడు శ్రీ కృష్ణదేవ రాయలు.

మరునాడు ఉదయం మేల్కొనిన శ్రీ కృష్ణదేవరాయలు తన సేనాపతిని పిలిచి ప్రస్తుతానికి యుద్ధయాత్ర నుండి విరమించుకుంటున్నట్లు ప్రకటించి సైన్యాన్ని తిరిగి ఇళ్లకి పంపెయ్యమని చెప్పాడు.

తదుపరి, వేద, ఆగమ పండితులను పిలిచి, తన స్వప్నం గురించి చెప్పాడు. పండితులంతా శ్రీ కృష్ణ దేవరాయలుని కావ్య రచన చేయమని సలహా యిచ్చి ఆశీర్వదించారు. వారి ఆశీర్వాదాన్ని కూడా స్వీకరించి శ్రీకృష్ణ దేవరాయలు ఆ ఆలయ మండపంలోనే కూర్చొని ఆండాళ్, రంగనాధుల వివాహగాధను ఆముక్త మాల్యద కావ్యంగా వ్రాసి, తిరుపతి వేంకటేశ్వర స్వామికి అంకితమిచ్చాడు.


ఈ కావ్య రచన చేసి, మహావిష్ణువు అనుగ్రహం పొందిన శ్రీ కృష్ణదేవరాయలు తరువాత కళింగదేశాన్ని కూడా జయించినట్టు యీ కావ్యంలోని ఆఖరి స్తోత్రాలలో తెలుస్తోంది.

ఒరిస్సా గజపతిరాజును తన భుజబలంతో ఓడించిన శ్రీ కృష్ణ దేవరాయలు రచించిన ఆముక్త మాల్యద ఒక గొప్ప సుందర కావ్యంగా లోకప్రసిద్ధి పొందింది.

– శేషశ్రీ

# చీర

## తనికెళ్ళ భరణి. 'పరికిణీ' నుండి..



రాత్రివేళ ఊరిస్తూ-జారుతూ
శృంగారం వొలికిస్తుంది
తెల్లారగట్ల ఆదరాబాదరాగా-అస్తవ్యస్తంగా
వొంటికి చుట్టుకున్నప్పుడు
హాస్యాన్ని చిలికిస్తుంది!
పుట్టింటివాళ్ళ దగ్గర్నుంచి
కబురొస్తే చాలు కళ్ళొత్తుకుంటూ...
కొంగంతా కరుణరసం వర్షిస్తుంది!!
నీళ్ళ టాంకర్ వీధిలోకొస్తే
బిందెకి సపోర్టింగా నడుమ్మీదకు చెక్కేసి
వీర రసాన్ని ప్రదర్శిస్తుంది
పనిమనిషి 'నాగా'పెడితే
బొడ్డులోకి దోపి అంట్ల మీద రౌద్రాన్ని ప్రదర్శిస్తుంది
మొగుడితో గొడవపడ్డ రోజున
నేలమీద చెంగై పరచుకొని
భయానకాన్ని- రుచి చూపిస్తుంది
అకారణంగా పతిదేవుడు తిట్టాడా
దూలానికి వేళ్ళాడుతూ
భీభత్సాన్ని... సృష్టిస్తుంది
పొరపాటయిందే అని బేలగా భర్త కన్నీరు పెట్టాడా !!
అంచుతో తుడుస్తూ అద్భుతాన్ని ఆవిష్కరిస్తుంది!!
రాజీకొస్తే చాలు మల్లెవంతి తెల్లని ఉల్లి పొరై
శాంతరసాన్ని... ప్రసాదిస్తుంది!
ఆరంభంలో మన్మధుడి కోట బురుజు పైన భావోద్వేగంతో
రెపరెపలాడే పతాకంలాంటి చీర !
పది నెల్లు తిరిగేసరికి పండంటి పాపాయిని
గుండెల్లో పెట్టుకొని మాతృ గర్వంతో ఊగిపోతూ
ఉయ్యాలైపోతుంది !!!




## శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

# అంతులేని ఆశ

పూర్వమొక ధనికుడుండెడివాడు, అతనికి వందల కొలది యెకరముల భూసంపద కలదు. కాని దానితో సంతృప్తిని బొందలేదు, వేలకొలది యకరముల నేల ఎచటనైనను చవుకగా లభించినచో కొని వేయవలెనను తలంపు గలిగి యుండెను. ఇంతలో హిమవత్పర్వత ప్రాంతమున విశాలమగు పీఠభూమి కలదని, అది అరణ్యమందలి కోయరాజుల వశమందు కలదని అతని కెవరో చెప్పిరి. వెంటనే ధనికు డచటికి ప్రయాణము సాగించెను. పట్టణమందు లభించు విచిత్రములైన ఆటవస్తువులను, తినుబండారములను ఒక పెద్ద బుట్టలో వేసికొని అతడు హిమ వత్పర్వత ప్రాంతములకు పయనమయ్యెను.

అచటికి వెళ్లి, కోయరాజును సమీపించి, వారి బిడ్డలకు తాను తెచ్చిన ఆట బొమ్మలను, ఫలహారములను పంచి పెట్టెను. కోయరాజు మహదానందభరితుడై 'సేట్‌జీ "మీరాక యేలకో వచింపుడు! మీయభీష్టమును నెరవేర్చెదను." అని మాటయిచ్చెను. వెంటనే ధనికుడు తనకు ఆ పరిసరమున కొంతనేల కావలెనని కోరగా, అందులకు కోయరాజు, 'అట్లే ఇచ్చెదను. దానికి మీరేమియు క్రయమును గూడ చెల్లింపనక్కర లేదు. ఎంతయో నేల వ్యర్థముగ ఇచట పడియున్నది. దానిని మీరు సాగుచేసికొని ఉపయోగించుకొనవచ్చును. అయితే ఒక షరతుపై దాని నిచ్చెదను. రేపు ఉదయము సరిగా 6 గంటలకు మీరిచటనుండి బయలుదేరి మీ యిష్టము వచ్చినంత దూరము నడచి మరల తిరిగి సాయంత్రం 6 గంటలకు ఈ చోటికి చేరవలెను. "మీరు నడచినంత దూరపు నేలయంతయు మీదే!" అని కోయరాజు ధనికునకు చెప్పెను

ఆ వాక్యములను వినగనే ధనికుని యానందము నకు మేరలేదు తన జీవితము కృతార్థమైనదని తలం చెను. తన ఈప్సితము నెరవేరినదని ఆనందపరవశు డయ్యెను. మఱునటి రోజు ఉదయం 6 గం॥లు ఎప్పుడు వచ్చునాయని వేచియుండెను. తెల్లవారిన పిదప సరిగా నిర్ణీతసమయమునకు కోయరాజు వచ్చి ధనికునకు ఒక స్థలము గుర్తుచూపి 'అచ్చోట నుండి ఎంతదూరమైనను నడచి వెళ్ళవచ్చు ననియు, అయితే సాయంత్రము 6 గంటలకు తిరిగి అక్కడకు చేరుకొన వలసియుండు' ననియు ఆదేశించెను. ధనికుడు బహుస్థూలకాయుడు. పొట్టిమనిషి నడక ప్రారంభించెను. నడిచినచో కొద్దిస్థలమే రాగల దనియు, పరుగెత్తినచో చాలస్థలమును ఆక్రమించు కొనవచ్చుననియు తలంచి ధనికుడు వేగముగ పరుగెత్త నారంభించెను. దానిలో ఒక చిన్నకాలువ అడ్డువచ్చెను. దిగిపోయినచో ఆలస్య మగుననియెంచి దానిని ఒక దూకు దూకెను. కాలుజారి పడి ఎట్టనో లేచి మరల కుంటుచు పరుగెత్త నారంభించెను. అది గ్రీష్మర్తువు మధ్యాహ్న సమయమున ఎండలో మలమలమాడుచు, చెమటకార్చుకొనుచు, పరుగిడుచున్న ఆ ధనికుని అవస్థచూచి జాలిపడి ఒకరు "అయ్యా! ఈ పాత్రలోని మంచినీళ్ళు త్రాగి దప్పిక తీర్చుకొనుడు" అని పాత్ర చేతికివుగా ధనికుడు తృణీకరించి "ఈ సమయమున నన్నేమియు పలుకరించకుడు. మీరిచ్చు నీళ్ళు త్రాగులోపల ఇంకను కొంత స్థలమును నేను ఆక్రమించుకొనగలను" అని పలికి తన పరుగును కొనసాగించెను.


ఈ ప్రకారముగ ఆహారము లేక, నీళ్ళు లేక, మండుటెండలో తల తిరుగుచుండ, కాలి దెబ్బతో వ్యథపడుచు ఆ ధనికుడు ఎక్కువ నేలను సంపాదించవలెనను పేరాశచే ఆరోగ్యమును, దేహస్థితిని గూడ లెక్కచేయక, తిరుగుదారి పట్టిపరుగెత్తి పరుగెత్తి తుదకు ప్రారంభించిన

చోటుకు పది గజముల దూరములో శోషచే క్రిందపడిపోయెను. కోయరాజు, తదితరులగు స్థానిక పెద్దలు హుటాహుటి అచ్చోటికి పరుగిడి వచ్చిచూడగా, ధనికుడు స్పృహతప్పి పడియుండెను. అతనినాడి సనగిల్లుచుండెను. రెండు మూడు నిముషము లకే ధనికుని ప్రాణపక్షి ఎగిరిపోయెను. అందఱును చింతాక్రాంతులైరి. ఇక చేయున దేమియు లేక కోయరాజు ధనికుడు ఎంత పొడుగు ఉండెనో కొలిపించి అంత పొడుగు మాత్రము నేలలో గొయ్యి త్రవ్వించి ధనికుని అందులో పూడ్చిపెట్టి సమాధిచేసెను.

జనుల ఆశకు అంతులేదు. అంతులేని ఆశనే తృష్ణయందురు. అట్టి తృష్ణను ముముక్షువులు తప్పక విడనాడవలెను. దానిచే మనుజునకు శాంతి ఏమాత్రముండ నేరదు. భగవంతుడిచ్చినదానితో సంతృప్తి నొంది ఉన్న కొలదికాలము ఆ పరా త్పరుని దివ్యనామోచ్చారణాదు లందు అనుభూతులందు గడపి ధన్యత జెందవలెను. చూచితిరా! ఆ ధనికుడు వేలకొలది ఎకరముల నేలను ఒక దెబ్బతో కొట్టివేయవలెనని సంకల్పించినను, అతని వెఱ్ఱి యభిలాష నెరవేరకపోగా, తుదకు అతని పొడుగు ఎన్ని అడుగులో అంతమాత్రపు నేలయే ఆతనికి దక్కెను. ఆతనికే కాదు, ఎవనికైనను తుదుకు దక్కునది అంతమాత్రపు నేలయే. కాబట్టి ఆశాపాశ శతంబులను విచ్ఛిన్నమొనర్చి, తృష్ణను దూరముగ పారద్రోలి, నిత్యసంతృప్తుడై, భగవద్భక్తి యుతుడై మనుజుడు తన జీవితమును పరిశుద్ధ మొనర్చుకొని కృతార్థుడు కావలయును.

**నీతి:– ఆశను వదలివైచి, భోగజాలమును దూరికరించి, ఉన్న స్వల్పపదార్థముతో సంతృప్తి నొందియుండవలెను.**





# రాజనాల

**“1948** సంవత్సరం నెల్లూరు టౌన్ హాలులో నేషనల్ ఆర్ట్ థియేటర్ అనే నాటకసంస్థ “ఎవరుదొంగ” అనే నాటకాన్ని ప్రదర్శిస్తుంది... అందులో రాజనాల కల్లయ్య అనే రెవెన్యూ ఉద్యోగి ప్రభుత్వ ఉద్యోగులలో ఉండే అవినీతిని ఎండగడుతూ అద్భుతంగా నటిస్తున్నాడు... ఆ నాటకానికి హాజరైన నెల్లూరుజిల్లా కలెక్టర్ కోపంతో ఊగిపోయాడు. ఒక ప్రభుత్వ ఉద్యోగివైవుండి ఇలా విమర్శంచడం చట్టవిద్దమంటూ కల్లయ్యను హెచ్చరించాడు...

కానీ అతని మాటలు లెక్కచేయకుండా తర్వాత “ప్రగతి” అనే నాటకాన్ని ప్రదర్శించారు... దానితో జిల్లా కలెక్టర్ కల్లయ్యను జాబ్ నుండి సస్పెండ్ చేశారు..

సత్యాన్ని తొక్కిపెడితే ప్రయోజనం ఏమిటంటూ కలెక్టర్ గారిని ప్రశ్నించిన కల్లయ్యా మళ్ళీ జాబ్‌లో చేరేందుకు ఇష్టపడలేదు...ఆ కల్లయ్య గారే తెలుగు సినీ పరిశ్రమలో “రాజనాల”గా పేరుపొందిన రాజనాల కాళేశ్వరరావుగారు.

రాజనాల గారు నెల్లూరుజిల్లా కావలిలో 1928 జనవరి 3 న జన్మించారు... మంచి ఉన్నతికుటుంబం. చిన్నతనం నుండి అభ్యుదయభావాలు కలవారు... ఇంటర్ చదివేరోజులలో నాటకసంస్థను స్థాపించారు... ఉద్యోగం మానేసిన తరువాత 1953లో తన స్నేహితుని సహాయంతో బియన్ రెడ్డి దగ్గర నెలకు? 200 జీతంతో ప్రతిజ్ఞ అనే సినిమా విలన్‌గా నటించారు... అది మంచి హిట్ కావడంతో తెలుగు సినిమాలో స్టార్ నటుడి స్థాయికి ఎదిగారు... జరాసంధుడు, కంసుడు, దుర్యోధనుడు, మాయలఫకీరు, దొంగలనాయకుడు, భూకామంధు, హాస్యవిలన్ లాంటి వైవిధ్య భరితమైన పాత్రల ద్వారా ప్రేక్షకులకు ఎంతో దగ్గరైనాడు. ఒకానొక సమయంలో హీరోలతో సమానంగా పారితోషికం అందుకున్నారు.. 1966 మాయా ది మెగ్నిఫిషియంట్ అనే హాలీవుడ్ సినిమాలో నటించి... హాలీవుడ్ లో నటించిన తొలి తెలుగు నటుడైనాడు... దాదాపు 25 సంవత్సరాలు తెలుగుసినీరంగంలో తనదైన ముద్రవేశాడు..45 సంవత్సరాలు రాజభోగాలనుభవించారు... నటనకు విలనేగాని మనసుమాత్రం వెన్న. ఎంతోమంది పేదకళాకారులకు ఆర్థికచేయూత నిచ్చారు, చాలామంది పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ ఇచ్చి చదివించారు..ఇంటికి వచ్చి చేయ చాచిన ప్రతి ఒక్కరికి సహాయం చేశారు..

“హాయిగా సాగుతున్న ప్రయాణంలో 1979 లో అతని భార్య చనిపోవడంతో ఒక్కసారి మార్పు కనిపించింది... మెల్లమెల్లగా ఆస్తులన్నీ కరిగిపోవడం ప్రారంభ మైనాయి.. 1982లోపెద్ద కొడుకు మరణం, 1984లో రెండో కొడుకు ముంబాయ్‌లో అదృశ్యం... మానసికంగా అతనిని కృంగతీశాయి... చెన్నైలోని ఆస్తులను అమ్మి

చిన్నప్పుడు రాజనాల సినిమాలను చూసి దడుసుకునేవాడిని, విలనిజంలో ఆయనకు ఆయనే సాటి, జానపద సినిమాలలో మాంత్రికుడిగా అద్భుతమైన నటనా ప్రతిభ కనబరిచేవారు. ముఖ్యంగా ఆయన హావాభావాలు, భలే భయా నకంగా వుండేది. నాన్నగారికి మంచి మిత్రులు. 1994-95 ప్రాంతాలలో మా ప్రెస్‌కు దగ్గరగానే వుండేవారు. ఒకటి రెండుసార్లు కాసేపు కూర్చుని పాతకాలం ముచ్చట్లు చెప్పేవారు. - జీవిరావ్)

స్నేహితుల సహాయంతో హైదరాబాద్‌లో రూబీ అపార్ట్‌మెంట్‌లో ఒక చిన్న ఫ్లాట్ తీసుకున్నాడు...మానసిక క్రుంగుబాటు... ఆర్థిక ఇబ్బందులతో చాలా ఇబ్బందులు పడ్డారు. 1995 లో తెలుగు వీర లేవరా అనే సినిమా షూటింగ్ అరకులో గాయపడి నాడు.. మధుమేహం వుండటంతో కాలు ఇన్ఫెక్షన్ అయి కాలు తీసివేయాల్సి వచ్చింది.

చివరి రోజులలో జ్యోతిష్యం, ముహూర్తాలు చెప్పుకుంటూ మే 21, 1998 లో మరణించారు.

మహానటుడు, యన్ టి ఆర్, ఏయన్నార్ లాంటి హీరోలతో సమానంగా పారితోషికం తీసుకున్న నటుడు... చేయి చాసిన ప్రతి ఒక్కరికీ సహాయంచేసిన మంచివ్యక్తి... రాజభోగాల నుండి అత్యంత దయనీయమైన కష్టాల జీవితం అనుభవిస్తూ తనువు చాలించడం... ఎవరికైనా కన్నీరు పెట్టించక మానదు... అందుకే అంటారు జీవితమనేది ఎలా ప్రారంభై ఎలా ముగుస్తుందో తెలియదు... ఈయన కష్టాలకు గుప్తదానాలు కూడా కారణమంటారు... అయితే రాజనాల కాళేశ్వరనాయుడు మహానటుడు అనడంలో సందేహం లేదు..

“ఈరోజు రాజనాల గారి వర్ధంతి సందర్భంగా..అతని జ్ఞాపకార్థం..

**- రవీంద్ర వెడిచర్ల!!**

## కొయ్యబారిన విష్ణువు - చమత్కార శ్లోకం

**గొ**ప్ప కవి ఒకాయన ఉత్కళ దేశంలో ఉన్న జగన్నాథుని దర్శించాడట. అక్కడి విగ్రహం చెక్కతో చేయబడి ఉండడం చూసి ఆశ్చర్యపోయాడట.

సామాన్యంగా అన్ని దేవాలయాలలో విగ్రహాలు రాతితో గాని, లోహాలతో గాని చేయబడతాయి కదూ. అలాగ ఆ దారుమూర్తిని చూసిన ఆ కవి మదిలో ఒక చమత్కార శ్లోకం మెరిసింది.

**శ్లో॥ ఏక భార్యా ప్రకృతిరచలా, చంచలా చ ద్వితీయా**
**పుత్రోనంగో, త్రిభువన జయీ,మన్మథో దుర్నివారః**
**శేషశ్శయ్యాప్యు దధి శయనం, వాహనం పన్నగారిః**
**స్మారం స్మారం స్వగృహచరితం దారు భూతో మురారి!**

అదేమంటే, శ్రీ మహా విష్ణువు తన కుటుంబంలోని వారి ప్రవర్తనలను చూసి తట్టుకోలేక కొయ్యబారిపోయాడట.

విష్ణుమూర్తికి ఇద్దరు భార్యలు. ఒకావిడ కదలకుండా ఉండే ప్రకృతి (భూదేవి), ఇంకొకావిడేమో (లక్ష్మి) ఒకచోట నిలకడగా ఉండకుండా, మనుష్యు లను మారుస్తూ తిరుగుతూ ఉంటుందిట.


కొడుకు (మన్మధుడు)ని చూద్దామా అంటే, ఎంతో దుర్మార్గుడని అందరితో తిట్లు తింటూ ఉంటాడు. అందరినీ బాధిస్తూ ఉంటాడు. వాడు బలంగా ఉన్నాడా అంటే, అసలు శరీరమే లేదు.

ఒక్క క్షణం విశ్రాంతి తీసుకుందా మనుకుంటే, తాను నడుము వాల్చేది ఒక పెద్ద పాము మీద, ఆదేమో మెత్తగా ఉంటుంది. ఎంత సేపూ బుసలు కొడుతూనే ఉంటుంది. ఒక తలా ఏమన్నానా, వెయ్యి తలలాయె. ఒక దాని తర్వాత ఇంకొక తల బుసలు కొడుతూనే ఉంటాయి.

ఆ పాము ఉండేది పాలసముద్రం మధ్యలో. అన్నీ అలలే, హోరున శబ్దం. ఒక అల అటు వైపు నుండి కొడితే, ఇంకొకటి యిటు వైపు నుండి కొడుతుంది.

పోనీ వాహనమెక్కి బయటికి పోదామా అంటే, అది ఒక పెద్ద గ్రద్ద పైన ఎగురుతూ పోతూ ఉంటే, క్రింద పాము కనబడితే చాలు, తన యజమాని పని మర్చిపోయి, గబుక్కున క్రిందికి దిగి, ఆ పామును కాళ్లతో పట్టుకొని తినే వరకు కదలదు.

ఇవన్నీ తలుచుకొని తలుచుకొని శ్రీ మహా విష్ణువు కొయ్యబారి పోయాడట!
కవుల మనసులో ఏది మెరిస్తే దానిని చెప్పేస్తారు, చమత్కారంగా.
బావుంది కదూ! (సేకరణ)





# ఈ భోగి పండుగ ఎలా వచ్చింది?

పెద్ద పండుగగా జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి పండుగలో మొదటి రోజును మనం భోగి పండుగగా జరుపుకుంటాం.

దక్షిణాయణంలో సూర్యుడు రోజు రోజుకి భూమికి దక్షిణం వైపుగా కొద్ది కొద్దిగా దూరమవుతూ దక్షిణ అర్ధగోళంలో భూమికి దూరం అవడం వలన భూమిపై బాగా చలి పెరుగుతుంది. ఈ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగ భగ మండే చలి మంటలు వేసుకునేవారు, ఉత్తరాయణం ముందు రోజుకి చలి విపరీతంగా పెరగడం ఈ చలిని తట్టుకునేందుకు భగ భగ మండే మంటలు, దక్షిణాయనంలో ప్రజలు తాము పడిన కష్టాలను, బాధలను అగ్ని దేవుడికి ఆహుతి చేస్తూ రాబోయే ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ఇమ్మని కోరుతూ వేసే మంటలు భోగి మంటలు అంటారని మన అందరికి తెలిసింది.

శ్రీ రంగనాధస్వామిలో గోదాదేవి లీనమై భోగాన్ని పొందిందని దీని సంకేతంగా భోగి పండగ ఆచరణలోకి వచ్చిందనేది మన పురాణ గాథ... కృష్ణుడు ఇంద్రుడికి ఒక పాఠం నేర్పుతు గోవర్ధన పర్వతం ఎత్తిన పవిత్రమైన రోజు ఇదే. శాపవశంగా పరమేశ్వరుని వాహనమయిన బసవన్నని భూమికి పంపించి రైతుల పాలిట దైవాన్ని భూమికి దిగి వచ్చిన రోజు ఇదే అనేవి కూడా పురాణాల గాథ.

సాధారణంగా అందరు చెప్పేది, ఇది చలి కాలం కనుక వెచ్చదనం కోసం మంటలు వేస్తారని. కానీ నిజానికి భోగి మంటలు వెచ్చదనం కోసం మాత్రమే కాదు, ఆరోగ్యం కోసం కూడా. ధనుర్మాసం నేలంతా ఇంటి ముందు పెట్టిన గొబ్బెమ్మలను పిడకలుగా చేస్తారు. వాటినే ఈ భోగి మంటలలో వాడుతారు. దేశి ఆవు పేడ పిడకలని కాల్చడం వలన గాలి శుద్ధి అవుతుంది. సుక్ష్మక్రిములు నశిస్తాయి. ప్రాణవాయువు గాలిలోకి అధికంగా విడుదల అవుతుంది. దాని గాలి పీల్చడం ఆరోగ్యానికి మంచిది. చలికాలంలో అనేక వ్యాధులు వ్యాపిస్తాయి. ముఖ్యంగా శ్వాసకు సంబంధించిన అనేక రోగాలు పట్టి పీడిస్తాయి. వాటికి ఔషదంగా ఇది పని చేస్తుంది. భోగి మంటలు పెద్దవిగా రావడానికి అందులో రవి, మామిడి, మేడి మొదలైన ఔషద చెట్ల బెరడ్లు వేస్తారు. అవి కాలడానికి ఆవు నెయ్యిని వేస్తారు. అగ్ని హోత్రంలో వేయబడిన ప్రతి 10 గ్రాముల దేశి ఆవు నెయ్యి నుంచి 1 టన్ను ప్రాణవాయువు (Oxygen) ను విడుదల చేస్తుంది. ఈ ఔషద మూలికలు ఆవు నెయ్యి, ఆవు పిడకలని కలిపి కాల్చడం వలన విడుదల అయ్యే గాలి అతి శక్తివంతమైంది. మన శరీరం లోని 72,000 నదులలోకి ప్రవేశించి శరీరాన్ని శుభ్ర పరుస్తుంది. ఒకరికి రోగం వస్తే దానికి తగిన ఔషదం ఇవ్వవచ్చు, అదే అందరికి వస్తే అందరికి ఔషదం సమకూర్చడం దాదాపు అసాధ్యం. అందులో కొందరు వైద్యం చెయించుకొలేని పేదలు కూడా ఉండవచ్చు. ఇదంతా ఆలోచించిన మన పెద్దలు అందరు కలిసి భోగి మంటల్లో పాల్గొనే సంప్రదాయాన్ని తెచ్చారు. దాని నుండి వచ్చే గాలి అందరికి ఆరోగ్యాన్ని ఇస్తుంది. కులాలకు అతీతంగా అందరు ఒక చోట చేరడం ప్రజల మధ్యన దూరాలను తగ్గిస్తుంది, ఐక్యమత్యాని పెంచుతుంది. ఇది ఒకరకంగా అగ్ని దేవుడికి ఆరాధనా, మరోరకంగా గాలిని శుద్ధి చేస్తూ వాయుదేవునికి ఇచ్చే గౌరవం కూడా.

కాని మనం ఫాషన్, సృజనాత్మకత పేరుతో రబ్బరు టైర్లను పెట్రోలు పోసి తగల బెట్టి, దాని విష వాయువులను పీలుస్తూ, కాలుష్యాన్ని చేస్తూ మన ఆరోగ్యాన్ని తగలేసుకుంటున్నాం. పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాం. ఉన్న రోగాలే కాక కొత్త రోగాలని తెచ్చుకుంటున్నాం. ఇక భోగి మంటల్లో పనికిరాని వస్తువులని కాల్చండి అని వింటుంటాం. పనికిరాని వస్తువులు అంటే ఇంట్లో ఉండే ప్లాస్టిక్ కవర్లు, వైర్లు లాంటివి కావు.

నిజానికి భోగి మంటల్లో కాల్చాల్సింది పాత వస్తువులని కాదు, మనలోని పనికి రాని అలవాట్లు, చెడు లక్షణాలు. అప్పుడే మనకున్న పీడ పోయి మానసిక ఆరోగ్యం, విజయాలు వస్తాయి. ప్రతీ దినము గృహద్వారం ముందు వరి పిండితో, ఈ విధముగా అనుకొనుచు మూడు కర్రలుగా వేయవలెను... 1) శాంతి సుఖ ప్రాప్యర్థం దుఃఖ నివారణార్థం 2) సర్వ పాప, రోగ, ఋణభాధా నివారణార్థం, ఆయురా రోగ్య ఐశ్వర్య ప్రాప్యర్థం 3) భూత ప్రేత పిశాచ భాధా నివారణా ర్థం ఆధ్యాత్మిక ఆనంద భక్తి జ్ఞాన వైరాగ్య ప్రాప్యర్థం, అని మూడు కర్రలు ముగ్గుతో వేయాలి, మరియు చీమ లకు, కొన్ని కీటకములకు ఆహారము కూడా సమర్పించినట్లు అగును.

## సంక్రాంతి వెనుక ఎవరికీ తెలియని అయిదు కథలు

సంక్రాంతి అనగానే సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే రోజు అని చాలా మందికి తెలుసు.

– పూర్వం సగరుడు అనే రాజు ఉండేవాడు. ఆయనకు అరవైవేల మంది కొడుకులు. వీళ్లంతా ఓసారి కపిలముని ఆశ్రమంలోకి ప్రవేశించి, ఆయన తపస్సుని భంగం చేశారు. దాంతో కపిలముని వాళ్లందరినీ బూడిదగామార్చేశాడు. ఆ బూడిద కుప్పల మీద గంగ ప్రవహిస్తే కానీ, వారి ఆత్మశాంతించదని తెలుస్తుంది. ఆకాశంలో ఉండే గంగని ఎవరూ నేల మీదకి తేలేకపోయారు. సగరుడి వంశంలో పుట్టిన భగీరధుడు ఈ పని చేయగలిగాడు. ఆయన తపస్సుకి మెచ్చి సంక్రాంతి రోజునే గంగమ్మ నేల మీద అవతరించిందట!

– సంక్రాంతి గంగిరెద్దుల వెనుక కూడా ఓ కథ ఉంది. పూర్వం గజాసురుడు అనే రాక్షసుడు ఉండేవాడు. శివుడు తన కడుపులో ఉండేలా ఆ గజాసురుడు వరాన్ని కోరుకున్నాడు.

శివుని బయటకు రప్పించేందుకు విష్ణుమూర్తి ఓ ఉపాయం ఆలోచించాడు. దేవతలంతా తలా ఓ వాయిద్యాన్నీ పట్టుకుని, నందితో కలిసి గజాసురుడి దగ్గరకు బయల్దేరారు. వీళ్ల ప్రదర్శనకు మెచ్చుకున్న గజాసురుడు ఏదన్నా వరాన్ని కోరుకొమ్మని అడిగాడు. ఇంకేముంది! తన పొట్టలో ఉన్న శివుడిని బయటకు పంపమని వరాన్ని అడిగేశారు. అలా ఆనాడు శివుని పొందేందుకు చేసిన హడావుడే, ఇప్పటి గంగిరెద్దుల సంప్రదాయానికి నాంది అని చెబుతారు.



# శ్రీ లలితాదేవిని గురించి తెలుసుకుందాం...

లలితా దేవి అంటే అమ్మ. అమ్మను గురించి ఏమి తెలుసుకుంటాం.

ఏదైనా బాధ కలిగితే ముందుగా స్మరించేది అమ్మనే. తండ్రిని సంతానమునకు పరిచయం చేసేది అమ్మే. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే.


శ్రీ లలితా సహస్రం శాస్త్రమనేందుకు ఒక ప్రబల నిదర్శనం వుంది. శ్రీ విష్ణు సహస్రనామంలో చాలా నామాలు మాటి మాటికి కనిపిస్తాయి అందులో నామ సంకీర్తన, స్తుతి ప్రభావం కాబట్టి, ముఖ్యమైన నామాలు వేరు వేరు చోట్ల వేరు అర్థఛాయలతో వస్తాయి. అది పునరుక్తి అయినా దోషం కాదు. కాని శాస్త్ర వివేచనలో పునరుక్తికి తావు లేదు. చెప్పిన మాట మళ్ళీ మళ్ళీ చెప్పటం శాస్త్ర విరుద్ధం. అందు వల్లనే రహస్య నామ సహస్రంలో ఏ నామం కూడా రెండు సార్లు రాదు. దానికి తోడు విష్ణు సహస్ర నామాలలో లేని పూర్వాపర సంబంధం, లలితా సహస్రంలో గోచరిస్తుంది. ఈ పూర్వపర సంబంధం విష్ణు సహస్రనామంలో జాగ్రత్తగా పరిశీలిస్తే గాని గోచరించదు. లలితా సహస్రనామంలో అది సామాన్య దృష్టికి కనిపిస్తుంది. ఈ నామ సహస్రాలకు రెండింటికి కొంత సామ్యం కూడా వుంది. కొన్ని నామాలు స్త్రీ పురుష భేదంతో రెండింటిలో కనిపిస్తాయి. నారాయణి నారాయణులు, భవానీ భవులు, ముకుందా ముకుందులు రెండింటిలో సమానంగా వినిపిస్తాయి.

విష్ణు సహస్ర నామం ప్రణవం చూపిన పరమ పావన పుష్పహాసమయితే, శ్రీ లలితా సహస్ర నామం శ్రీ మాత చేసిన చిన్మయ చారుహాస మవుతుంది. ఆదివిష్ణువు కృష్ణచైతన్య రూపంలో విశ్వరూపం దివ్యనామ సహస్రంలో గేయమైతే, అదే దేవీ నామ సహస్రంలో, ధ్యేయమయింది. రెండూ ఒక విధంగా విశ్వనామ సహస్రాలే. దివ్య సహస్రంలో... "సహస్రమూర్ధా విశ్వాత్మా సహస్రాక్షః సహస్రపాత్" అని కొనియాడబడిన విశ్వరూపమే "దేవీ సహస్రంలో-సహస్ర శీర్షవదనా సహస్రాక్షీ సహస్రపాత్" సాక్షాత్కరిస్తుంది. నిజానికి శ్రీ మహావిష్ణువులోని దివ్య తత్త్వం: శ్రీ మాత లోని దేవీ తత్త్వం, ఒకే పరమ తత్త్వానికి రెండు రూపాలు. సాధకులకు సద్భావంలో సగుణంగా, రెండూ వేరు వేరుగా గోచరించినా, చిన్మయ దృష్టితో తన్మయ భావంతో తరిచి చూస్తే, రెంటిలోను ఒకే ఆనందమయి బిందువు కనిపిస్తుంది.

శ్రీమాతాశ్రీ మహారాజ్ఞీ :- శ్రీ అంటే లక్ష్మి. మా అన్నా లక్ష్మే. ఒకటి బ్రాహ్మీలక్ష్మి: మరొకటి వైష్ణవీ లక్ష్మి. అన్ని రకాల లక్ష్మీ సంతతిని ప్రసాదించే శ్రీమాత త్రి జగన్మాత. ఆమె సామ్రాజ్యం మూడు లోకాలలో వ్యాపించి వున్నది. ఆమె మహారాజ్ఞీ. అసలు దేవకార్యం కోసమే ఆమె అవతరించింది. దేవతలకు దీప్తి సహజమైన లక్షణం. ఆ దీప్తికి మూలం పరమేశ్వరి. మనస్సులోని వెలుగు ముఖంలో కనిపిస్తుంది. ఇది చిదగ్నిలోని కాంతి. ఒక చేతిలో అనురాగమనే ప్రేమ పాశం. మరోచేతిలో కోపమనే అంకుశం మూడోచేతిలో మనసు లాంటి తియ్యని చెరకు విల్లు. నాలుగో చేతిలో శబ్ద స్పర్శ రూప రస గంధాలనే బాణాలను ధరించి వున్న పరమేశ్వరి రూప లావణ్యం చూచి తీరాలి. ప్రాణి కోటికి పరం జ్యోతిని ప్రసాదిస్తూ ఉంటుంది. తల్లిలా కనిపించుతుంది. తండ్రిలా లాలిస్తుంది. గురువులా ప్రపంచపు విలువలను కొలిచి చెపుతుంది. అభిమానం గల తల్లికి అపుడపుడు కోపం రావచ్చును. అది ప్రేమను పెంచేందుకే గాని త్రుంచడానికి కాదు.

**- గోపరాజు రాజేంద్ర ప్రసాద్**

---



- కనుమ రోజు పశువులని పూజించడం వెనుక కూడా ఓ కథ విని పిస్తుంది. ఒకసారి శివుడు నందిని పిలిచి 'భూలోకంలో అందరూ రోజూ ఒంటికి నూనె పట్టించి స్నానం చేయాలి, నెలకి ఓసారే ఆహారం తీసుకోవాలి' అని చెప్పి రమ్మన్నాడు. కానీ నంది అయోమయంలో 'రోజూ ఆహారం తీసుకోవాలి, నెలకి ఓసారి నూనె పట్టించి స్నానం చేయాలి' అని చెప్పిందట. దాంతో కోపం వచ్చిన శివుడు. 'ప్రజలు రోజూ తినాలంటే చాలా ఆహారం కావాలి. ఆ ఆహారాన్ని పండించేందుకు నువ్వే సాయపడాలి' అని శపించాడు.

అప్పటి నుంచి ఎద్దులు, వ్యవసాయంలో సాయపడు తున్నాయట. కనుమ రోజు పశువులని సాక్షాత్తు నందీశ్వరు లుగా భావించి పూజిస్తుంటారు.

- సంక్రాంతికి గాలిపటాలు ఎగరేస్తాం కదా! దీనికి కూడా ఓ కథ చెబుతారు. సంక్రాంతితో ఉత్తరాయణ పుణ్యకాలం మొదలవుతుందట. ఇది దేవతలకు పగలు అని నమ్మకం. దేవతలంతా ఈ కాలంలో ఆకాశంలో విహరిస్తారట. దేవతలకి స్వాగతం పలికేందుకు, వారి దృష్టిని ఆక ర్షించేందుకు గాలిపటాలు ఎగరేయాలని చెబుతారు.

- సంక్రాంతితో పాటు ఇంటింటా అడుగుపెట్టే హరిదాసుకి కూడా ఓ ప్రత్యే కత ఉంది. సంక్రాంతికి సాక్షాత్తు ఆ శ్రీకృష్ణుడే, హరిదాసు రూపంలో మన ఇంటికి వస్తాడట. ఆయన తల మీద ఉండే పాత్ర, ఈ భూమికి చిహ్నా మని చెబుతారు. అందుకే ఆ పాత్రని హరిదాసులు నేలమీద పెట్టరు. భిక్ష పూర్తయ్యి ఇంటికి చేరుకున్నాకే దాన్ని కిందకి దించుతారు. ఇవండీ సంక్రాంతి గురించి ఓ అయిదు కథలు. ఇంకా గొబ్బెమ్మలు దగ్గర నుంచి భోగిపళ్ల వరకు... సంక్రాంతిలో కనిపించే ప్రతి ఆచారానికీ ఓ కథ ఉంది. ఇలా కథలతో చెపితే మనసుకు హత్తుకుంటుందని.

- కేపి



# సంక్రాంతి సంబరాలు

## తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి

నెల రోజులపాటు జరుపుకునే పండగ "సంక్రాంతి". మనం జరుపుకునే పండుగలన్నీ ఏదో దైవానికి సంబంధించినవే.!

కానీ సంక్రాంతి పండుగ మాత్రం "పంటల పండుగ. రైతుల పండుగ. కళాకారుల పండుగ". ఈ పండుగకు మూలపురుషుడు "రైతన్న". ఆరుగాలం పంటపొలాలలో శ్రమించే "రైతన్న" చేసుకునే పండుగ ఇది.

తన పంట కోతకొచ్చినప్పుడు ఉదయం నుంచీ అర్ధరాత్రి వరకు పొలంలో కష్టపడిన రైతన్నకు కళాకారులు అందరూ అండగా నిలబడతారు. వాళ్ళ వివరాలు తెలుసుకుందాం.



**బుడబుక్కలవాడు:**

ఈ పండుగ కళారూపాలలో తొలి తాంబూలం బుడబుక్కలవానిది. పగలంతా కష్టపడిన రైతన్న రాత్రికి నడుం వాలిస్తే కళ్ళంలోని ధాన్యాన్ని దొంగలు తరలించుకు పోకుండా తొలిఝాములో ఊరి పొలిమేరలలో సంచరిస్తూ క్రొత్తవాళ్ళను గ్రామంలోకి చొరబడనీకుండా 'కట్టు' కట్టి కట్టడి చేసేవాడు బుడబుక్కలవాడు. ఇతను తొలిఝామంతా పంటకు కాపలా కాసి రెండోఝాము ప్రవేశిస్తుండగా జంగం దేవరకు ఆ పని అప్పచెబుతాడు.

**జంగందేవర:**

సాక్షాత్తూ శివుని అవతార అంశలుగా భావించే ఈ జంగందేవరలు శంఖ నాదాలతో ఢమరుక శబ్దాలతో రైతుల కళ్ళాలకు ఊరి ప్రజానీకానికి శుభం పలుకుతూ పరమశివుని ఆశీస్సులను అందించే కాపాలికుడు ఈ జంగందేవర!

**హరిదాసు:**


'హరిలో రంగ హరి' అంటూ శ్రీకృష్ణుని గాథలను కీర్తిస్తూ ఇంటింటి ముంగిటికీ వచ్చి పొలం వెళ్ళిన రైతుల క్షేమసమాచారాలను వాళ్ళ ఇళ్ళలో తెలుపుతూ హరినామసంకీర్తనామృతాన్ని దోసిళ్ళతో అందించి దోసెడు బియ్యాన్ని కృష్ణార్పణమంటూ స్వీకరిస్తాడు. ఆ యదుకులేశుని ఆశీస్సులను తన ద్వారా మనకు అందిస్తాడు.

**గంగిరెడ్లు:**

హరిదాసు ఇంటిలోని వారిని పలకరించి ఇంటి ఆడపడుచులు వేసిన రంగవల్లులపై కృష్ణపరమాత్మ ఆశీస్సులు కురిపించాక అయ్యగారికి దండపెట్టు, అమ్మగారికి దండం పెట్టు, బాబుగారికి దండంపెట్టు, పాపగారికి దండం పెట్టూ అంటూ బసవన్నల చేత దండాలు పెట్టించి, రైతు బ్రతుకుకు అంతా తానై నడిపే ఎడ్లను అలంకరించి ఇంటి ముంగిట్లో ఎడ్ల ఆట ఆడించి ఇంట్లోని చిన్నా పెద్ద అందరినీ అలరించిన గంగిరెద్దుల వాళ్ళు సన్నాయి ఊదుకుంటూ వెళ్ళిపోతారు

**పిట్టలదొరలు:**

గంగిరెడ్లు, డూడూ బసవన్నలు వెళ్ళాక మనలను నవ్వులలో ముంచెత్తే కబుర్ల పోగు, కోతలరాయుడు పిట్టలదొర వస్తాడు. తనకు అరేబియా సముద్రంలో ఆరువేల ఎకరాల భూమి ఉందని, బంగాళాఖాతంలో బంగ్లాలున్నాయని ఆ బంగ్లాలకు వెళ్ళడానికి సరైన దారిలేక ఈమధ్యనే బొప్పాయి కలపతో బ్రహ్మాండమైన బ్రిడ్జి కట్టించాననీ అవన్నీ పిల్లలు అడిగితే ఇచ్చేస్తానని డంబాలు పోతాడు. పిల్లలందరికీ నవ్వుల పువ్వులు పంచుతాడు.











**సోదెమ్మ??**

సోదెమ్మ వెళ్ళిన తరువాత మన భవిష్యత్ ఫలాలను చెబుతానంటూ 'సోదె చెబుతానమ్మా సోదె చెబుతాను ఉన్నదున్నట్టు చెబుతాను లేనిదేమీ చెప్పను తల్లీ' అంటూ మన భవిష్యత్తులో జరగబోయే వాటి గురించి తనకు తోచింది చెప్పి ఇంత ధాన్యం, పాతచీర, రవికల గుడ్డ పెట్టించుకుని పోతుంది.

**భట్రాజులు:**

ఆరు నెలల కష్టానికి ఫలితం వచ్చేవేళలో ధాన్యాన్ని ఇంటికి తరలించే సమయంలో రైతుల కళ్ళాలలోకి వెళ్ళి రైతుని ఆతని వంశాన్ని ఆతని పెద్దలనూ పొగడుతూ ఆ రైతు కుటుంబం జడనూరేళ్ళు చల్లగా ఉండాలని దీవిస్తూ పద్యాలల్లి ఆశీస్సులను వెదజల్లి ఓ కుంచెడో రెండు కుంచాలో ధాన్యాన్ని కొలిపించుకుని భుజాలకెత్తుకుంటారీ భట్రాజులు.

**కొమ్ముదాసర్లు:**

అన్ని పనులు పూర్తి చేసుకున్న తరువాత కాస్త నడుం వాల్చి విశ్రాంతి తీసుకుందామనుకుంటే ఈ కొమ్ముదాసరోడు వచ్చి పెరట్లో చెట్టుకొమ్మనెక్కి 'అప్పయ్య గోరో పడతా పడతా నే పప్పుదాకలో పడతా, పడతా పడతా నే పాతరగోతిలో పడతా' అంటూ అల్లరి చేస్తాడు. అమ్మలక్కలు,పిల్లలు చెట్ల క్రింద జేరి క్రిందకు దిగమని బ్రతిమాలతారు. ఆ పాతరగోతి మీద పాతబట్టలు పరచమని చెప్పి వాటిని పట్టుకెడతాడు.

ఇక్కడ పాతరగోతి గురించి చెప్పాలి.

పూర్వం పండిన పంటను ఇంటికి తెచ్చి పెరట్లో గొయ్యి తవ్వి ఆగోతిలో తాటాకులు కొబ్బరాకులు పరిచి వాటిపైన గడ్డి పరిచి మెత్తను తయారుచేసి ఆపైన ధాన్యం పోసి నిలవచేసే వారు. దీనినే పాతరగొయ్యి అంటారు. పొద్దన్నుంచి పని చేసి చేసి అలసి సొలసి నిద్రపోతారేమో ఇదే సందని దొంగలు ఆ గోతిని తవ్వి పండిన పంటనంతా దోచుకుపోవచ్చు.మీ పాతరగొయ్యి సరిగా ఉందో లేదో ఓ సారి చూసుకోండి అని చెప్పడానికి ఈ కొమ్ముదాసరి వస్తాడు.

ఈవిధంగా ఇంతమంది కళాకారులు నెలరోజుల పాటు రైతుల పంటలకు కాపలా కాస్తూ రైతుల క్షేమాన్ని కాంక్షిస్తూ మన పొలాలకు పహారా ఇస్తారు.

మనకింత సాయం చేసిన వాళ్ళకు మనమేమిస్తున్నాము???

నాలుగు గుప్పెళ్ళ బియ్యం,నాలుగు పాత గుడ్డపీలికలు. ఇంటిల్లిపాది మంచిని కోరుకుంటూ మన ముంగిటికొచ్చే కళాకారులను ఆదరించండి!!!

వెండితెరపై, బుల్లితెరపై ఓ సారి కనబడిన వాళ్ళందరికీ వేలు, లక్షలు పోసి వాళ్ళ వెకిలి చేష్టలను ఆనందించేకన్నా మన సౌఖ్యాన్ని, మన సౌభాగ్యాన్ని కోరుకునే ఈ పల్లె కళాకారులను అక్కున జేర్చుకుందాం!!!

మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందాం. ●


# ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత 28 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినేలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న దబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :

| | | |
|---|---|---|
| Account Name | : | PRAMUKHANDHRA |
| Account No | : | 20011102592 |
| Bank | : | BANK OF MAHARASTRA, T.NAGAR |
| IFSC Code | : | MAHB 0000450 |

**ప్రముఖాంధ్ర**

64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.

మొబైల్ : 98400 48941





# భూవరాహ క్షేత్రం, శ్రీముష్ణం

శ్రీ మహావిష్ణువు భారతదేశంలో 8 ప్రదేశాలలో స్వయంభువుగా ఆవిర్భవించాడు.

1. శ్రీరంగం 2. శ్రీ ముష్ణం 3. తిరుపతి

4. వానమామలై 5. సాలగ్రామం 6. పుష్కరం

7. నైమిశారణ్యం 8. బదరికాశ్రమం

భూ వరాహస్వామి స్వయంభువుగా వెలిసిన శ్రీముష్ణం పుణ్యక్షేత్రం తమిళనాడులో ఉంది. ద్రావిడ శైలి శిల్పకళలో నిర్మించిన ఈ ఆలయంలో వరాహ స్వామి, అతని భార్య అంబుజవల్లి తాయార్‌లు కొలువై ఉన్నారు. 10 వ శతాబ్దానికి చెందిన చోళులు నిర్మించగా, తంజావూర్ నాయక్ రాజు అచతప్ప నాయక్ విస్తరించారు. ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్న సౌందర్య శిల్పాలు ఆనాటి శిల్పుల కళాత్మకత దృష్టికి, ప్రతిభకు తార్కాణాలుగా నిలుస్తాయి.

## ఆ పుణ్యక్షేత్రం విశేషాలు...

1. హిందూ పురాణాలను అనుసరించి శ్రీ మహావిష్ణువు స్వయంభువుగా వెలిసిన తొమ్మిది క్షేత్రాల్లో శ్రీ ముష్ణం కూడా ఒకటి. ఇది తమిళనాడులోని కడలూరు జిల్లా వృద్ధాచలానికి 19 కిలోమీటర్ల దూరంలో, మరో పుణ్యక్షేత్రమైన చిదంబరానికి 39 కిలోమీటర్ల దూరంలో ఉంది.
2. హిరణ్యకశిపుడి సోదరుడైన హిరణ్యాక్షుడు భూదేవిని సముద్రంలో ఉంచుతాడు. భూదేవి ప్రార్ధనతో కరిగిపోయిన విష్ణువు వరాహ రూపంలో వచ్చి ఆమెను రక్షిస్తాడు. ఇక్కడ ఉన్న అమ్మవారిని అంబుజవల్లీ పేరుతో కొలుస్తారు. విష్ణువు దశావతారాల్లో వరహావతారం రెండవది.
3. హిరణ్యాక్షుడిని యుద్ధంలో చంపిన తర్వాత సాలగ్రామ శిలలో వరాహస్వామి ఇక్కడ స్వయంభువుగా వెలిశాడు. యుద్ధం చేసే సమయంలో స్వామి వారి శరీరం నుంచి చిందిన చెమట వల్ల ఇక్కడ పుష్కరిణి ఏర్పడిందని నమ్మకం. దీనిని నిత్య పుష్కరిణి అని అంటారు. నిత్య పుష్కరిణి లో స్నానం చేస్తే చర్మరోగాలు పూర్తిగా సమసిపోతాయని చెబుతారు.
4. అదే విధంగా స్వామి వారి రెండు కన్నుల నుంచి తులసి, అశ్వర్థ వృక్షం ఏర్పడినట్లు స్థల పురాణం వివరిస్తుంది.
5. అశ్వర్థ వృక్షాన్ని పూజిస్తే సంతానం లేనివారికి త్వరగా పిల్లలు పుడతారని నమ్మకం. ముఖ్యంగా పుష్కరిణిలో స్నానం చేసి అశ్వర్థ వృక్షం కింద గాయత్రి మంత్రం జపిస్తే చనిపోయిన తర్వాత స్వర్గ ప్రాప్తి లభిస్తుందని పురాణకథనం.
6. స్వామివారి విగ్రహం చిన్నదిగా ఉంటుంది. ఇక్కడ స్వామి వారి శరీరం పశ్చిమ ముఖంగా ఉండగా ముఖం మాత్రం దక్షిణం వైపు ఉంటుంది.
7. హిరణ్యాక్షుడు తన ఆఖరి ఘడియల్లో స్వామివారిని తనవైపు చూడమని ప్రార్ధించాడు. అందువల్లే స్వామి శరీరం పడమర వైపుగా ఉన్న మొహం దక్షిణం వైపు ఉంటుంది. స్వామి వారు నడుం పై చెయ్యి పెట్టుకొని గంభీరంగా కనిపిస్తారు.
8. ఇక ఇక్కడ వెలిసిన అంబుజవల్లీ అమ్మవారికి స్వామి వారిని అందమైన రూపంలో చూడాలని కోరుకొంటుంది. దీంతో స్వామి వారు శంఖ, చక్రాలను కలిగి అందమైన నారాయణుడి రూపంలో వెలిశాడు.
9. అందువల్లే ఇక్కడ ఉత్సవ మూర్తి విగ్రహం వరాహ రూపంలో కాక, నారాయణుడి రూపంలో ఉంటుంది. ఉత్సవ విగ్రహాలు గర్భగుడిలో కాకుండా ఆలయంలోని వేరొక మండపంలో ఉండటం ఇక్కడ విశేషం.
10. వరాహ స్వామితో పాటు చిన్న గోపాలుడి విగ్రహాన్ని కూడా మనం చూడవచ్చు. వరాహ స్వామితో పాటు గోపాలుడు ఇక్కడ స్వయంభువుగా వెలిశాడని చెబుతారు.
11. ఈ ఆలయంలో పదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. మొదటి రోజు భరణీ నక్షత్రంలో ఈ ఉత్సవాలు ప్రారంభమవు తాయి.
12. ఆ సమయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని దగ్గర్లో ఉన్న సముద్రం వద్దకు తీసుకువెళతారు. అక్కడకు చేరుకొనే లోపు తాయ్ కల్ అనే గ్రామంలో ఒక మసీదు దగ్గర ఊరేగింపు ఆగిపోతుంది.
13. అక్కడ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తారు. మసీదుకు చెందిన కాజీ, స్వామి వారికి పూల దండ సమర్పించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ.

మసీదులో కర్పూరం వెలిగించి తర్వాత ఖురాన్ చదువుతారు. బాణా సంచా కూడా కాల్చిన తర్వాత ఊరేగింపు యథావిధిగా సాగుతుంది.

14. ఇందుకు సంబంధించిన కథనం కూడా ఉంది. ఒకసారి ఇక్కడి నవాబుకి జబ్బు చేస్తుంది. విషయం తెలుసుకొన్ని స్థానిక మధ్వ బ్రాహ్మణుడు నవాబుని కలిసి స్వామి వారి గుడి నుంచి తెచ్చిన ప్రసాదాన్ని ఇస్తాడు.

15. క్షణాల్లో రాజు రోగం తగ్గిపోతుంది. దీంతో నవాబు మిక్కిలి సంతోషంతో ఆ ఆలయానికి అనేక ఎకరాల సారవంతమైన భూమిని దానం చేశారు. ఈ భూమి ఇప్పటికీ మధ్వ బ్రాహ్మణుల రక్షణలో ఉంది.

16. ఇక్కడ చిత్తిరై ఉత్సవాలు చాలా బ్రహ్మాండంగా జరుగుతాయి. శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామి వారిని ఆలయం చుట్టూ ఉన్న నాలుగు మాడ వీధుల్లో ఊరేగిస్తారు.

17. అటు పై ఫిబ్రవరి, మార్చి నెలల్లో వచ్చే ఉత్సవాల్లో దేవేరులతో కలిసి స్వామి వారు చుట్టు పక్కల గ్రామాలకు వెళుతుంటారు. ఆ సమయంలో ఆయా గ్రామాల వారు గ్రామ పండుగను చేస్తారు.

18. ఇక్కడ కొలువై ఉన్న అంబుజవల్లికి నవరాత్రుల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. తమిళ నెలలైన ఆడి, తైయ్ లలో ఆఖరి శుక్రవారంనాడు అమ్మవారిని సువాసన భరితమైన పుష్పాలతో అలంకరించి పల్లకిలో ఊరేగిస్తారు.

19. ఇక్కడ స్వామివారిని పూజించడం వల్ల సకల సంపదలూ లభిస్తాయని చెబుతారు. గ్రహ దోషాలున్నవారు ఇక్కడ స్వామివారిని కొలిస్తే ఆ బాధలన్నీ తొలిగిపోతాయని స్థానికుల నమ్మకం. ●

# స్థానం వారి సమయస్ఫూర్తి




ఇప్పటితరం వారికి తెలుసోలేదో గాని, స్థానం నరసింహారావుగారు స్త్రీ పాత్రలకు పెట్టింది పేరు. ఓ తెల్లదొర ఆయన 'మురా' పాత్రను చూచి, సమ్మోహితుడైన స్త్రీ యనుకొని వెళ్ళి స్టేజీమీదే కౌగలించుకున్నాడు. అలాంటి ప్రతిభావంతుడు స్థానం నరసింహారావుగారు అనకాపల్లిలో శ్రీకృష్ణ తులాబారం నాటకంలో చివరిరంగంలో సత్యభామగా వచ్చారు. రుక్మిణీ పాత్రలోనున్నామె తులసిదళంతో తూస్తూ, తులసిదళం పట్టుకుని–

**ఫలమో, ఘనరసంబో, పత్రమో, పుష్పమో**
**గొనుచు భక్తి నిన్ను గొలుచువారి**
**కీవు వశుడవగుటయే సత్యమేని యీ**
**తులసిదళము నిన్ను తూచుగాక–** అనే పద్యం పాడి తులసిదళమును త్రాసులో వేసింది. ఏదో సాంకేతిక లోపం వలన కృష్ణుడు కూర్చొని ఉన్న ప్రక్కన ఉన్న త్రాసు సిబ్బె పైకి లేవలేదు. కృష్ణపాత్రలోని వాడు పద్యంగాకముందే త్రాసు లోంచి లేచివెళ్ళాడు. నాటకం చూస్తున్న ప్రేక్షకులు గేలిగా ఈలలు వేస్తున్నారు. కోలా హలం చేస్తున్నారు.

అదిజూచి సత్యభామ పాత్రలోని స్థానంవారు 'అక్కా నీ ధ్యానం నిలకడ తప్ప లేదు. పరాకాష్టనందుకున్నది చూచితివా అంటూ స్థానంవారు సత్యభామ పాత్రలో రుక్మిణిని సమర్థిస్తారు. ఆ సమయస్ఫూర్తి సంభాషణను చూచి హాలులో ఉన్న ప్రేక్షకజనం కంఠంతో జయధ్వానములు చేసారు. అదీ మన తెలుగు నాటకరంగం అప్పటి నటుల ప్రతిభ. ●

# త్యాగరాజువారి కీర్తనం సర్వవేద సారం!



**చక్కని రాజ మార్గములుండగ**
**సందులు దూరనేలే ఓ! మనసా! ॥చ॥**
**చిక్కని పాల మీగడలుండగ**
**ఛీయను గంగాసాగర మేలే! ॥చ॥**
**కంటికి సుందరతమగు రూపమే, ము**
**క్కంటి నోట చెలగేనామమే త్యాగరా**
**జింటనే బాగనెల కొన్నది దైవమే యిటు**
**వంటి శ్రీ సాకేత రాముని భక్తియనే ॥చ॥**

కర్మజ్ఞాన, విజ్ఞానములన్నిటినీ చిన్న చిన్న కీర్తనముల్లో అలతి అలతి సలలిత పదముల్లో పొదిగింపచేసాడు. సకల సద్గుణములను ప్రోదిచేసి సంగీత సుస్వర, లయబద్ధంగా వివరింప చేసాడు. విషతుల్యమైన మందును రోగి మ్రింగలేడు. అందుకై ఆయుర్వేదశాస్త్రము తేనె, పటికబెల్లం, పంచదారలను అనుపానములుగా తోడు (జోడు) కావించి తినమన్నది.

త్యాగరాజులవారి కీర్తనలూ అలాంటివే.

చాగంటి కోటేశ్వరరావుగారి కర్మ పునర్జన్మ గూర్చి 3 రోజులు $7^1/_2$, $8^1/_2$ గంటల శ్రవణం చేసినపుడు కర్మ, పునర్జన్మల గురించి త్యాగరాజులవారు కీర్తించిన కీర్తనలను శ్రీరామచంద్రుడు నాకు స్ఫురింపచేసాడు. ఇలా వ్రాయగలగడం భారతభారతి అనుగ్రహమే! సర్వదేవత, సురదేవత అనుగ్రహమే!

ఇక్కడ మరొక సత్యాన్ని వివరించవలసిన అవసరం ఎంతగానో ఉన్నది. త్యాగరాజ కీర్తనలను ప్రచా(సా)రంలోకి తెచ్చినవారు తమిళ విద్వాంసులు. వారిలో పెక్కుమంది గాయనీగాయకులు లయ, స్వర, తాళములకే స్థానమిచ్చారుగానీ, త్యాగరాజు పదాల్ను స్పష్టంగా వివరించలేదు. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, డి.కె. పట్టమ్మాళ్, ఎం.ఎల్. వసంతకుమారి, డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, డా॥ నూకల చిన సత్యనారాయణ– ఇలా ఎవరో కొద్దిమంది తక్క, త్యాగరాజులవారి భక్తి ప్రపత్తి గల సాహిత్యాన్ని వినిపించే ప్రయత్నం చేయలేదు.

చిత్తూరు వి. నాగయ్యగారు ఎందరో సంగీత గాన, గాయనీ మణులను ఆహ్వానించి, సమావేశపరచి, త్యాగరాజ కృతుల స్వర బద్ధ నియమాలను గ్రహించి, త్యాగయ్య పాత్రలో లీనమై, కృతుల్లోని అక్షరాలను స్పష్టంగా పలికారు. కానీ ఎంతమంది ఈ ప్రయత్నం చేసారు. తన ఆర్జితంలో (ఆరోజుల్లోనే లక్షరూపాయలు తీసుకున్న చిత్తూరు వి. నాగయ్య) ఓ 50కి పైగా గ్రౌండుల స్థలాన్ని ఆర్కాటు రోడ్ మీద భూమిని విక్రయించి త్యాగయ్య చిత్రానికి ఖర్చుపెట్టారు. ఇప్పుడు త్యాగరాజనగర్ నడిబొడ్డులోనున్న వాణీమహల్‌గా ఉన్న స్థలాన్ని ఆయనే క్రయంచేసి త్యాగబ్రహ్మగాన సభగా తీర్చిదిద్దారు. తత్పూర్వ ఖాళీ స్థలంలోనే తాను పిలిచిన సంగీత విద్వాంసులందరికీ మృష్టాన్న భోజనాలు పెట్టి పునీతం చేసారు. త్యాగరాజ సంకీర్తనంతో ఆ నేలలోని అణువణువూ సంగీతమైంది. ఇప్పటికీ వాణీమహల్ (త్యాగబ్రహ్మహాలులో) సంగీత కచ్చేరి సప్తాహాలు, దశాహాలు జరుగుతూనే ఉన్నాయి. ఆ నేల అటు వంటిది, ఆ నేలలోని అణువుల సారం అటువంటిది.

అసలు విషయానికి వస్తున్నాను. కర్మను, కర్మయోగాన్ని, కర్మ ఫలాన్నీ త్యాగరాజులవారి కీర్తనల్లోనే కనిపిస్తుంది. సర్వవేదసారం, సర్వ ఉపనిషత్తుల సారం, భక్తి నివేదన, భక్తుని ఆవేదనల్నీ ఆయనే కీర్తనల్నో వివరించారు. గీతా సారం, శ్రీరామమానసం, వైదేహీ అమ్మతత్త్వం, భరత, లక్ష్మణ, శత్రుఘ్నుల భ్రాతృత్వం, సోదరి శాంతపై గల అవ్యాజ అభిమానం, దాస్యభావంతో హనుమంతుని వాత్సల్యం, తల్లి కౌసల్య తన ఇరువురి తల్లులపై చూపిన అపారగౌరవం, వశిష్ట విశ్వామిత్రులపై గురుభక్తి అన్నీ త్యాగరాజుల వారి కీర్తనల్లో ఉన్నాయ్. వాటిని చదవాలి, వివరంగా గాయనీగాయకులు వినిపించాలి. సంగీతంతో కుదరని రోగాలు లేవు. త్యాగ్యరాజ కృతుల శ్రవణంతో వినని వేద, ఉపనిషత్సారం లేదు. ●

అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే

# అతి

**337 నెలలుగా**
**337 సంచికలను**



శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే।

# ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల ఱేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.25000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)



గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు


చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

# GOTETI GRAPHICS

*The Complete Printing Solutions*

*Complete Service from Designing to Delivery*

*What we do....*

**BOOKS** ❖ Biography ❖ Magazines ❖ In-house magazines ❖ Souvenirs ❖ Brochures ❖ Diaries & Company profiles.

**OFFICE STATIONARY** ❖ Business Cards ❖ Letterheads ❖ Invoice ❖ Vouchers ❖ Receipts ❖ Delivery Challan Books ❖ Invitation Cards ❖ Wedding Cards ❖ Other occasion Cards ❖ Dance Arangetram Cards ❖ Hotel Menu Cards ❖ Merit Certicicates.

**BINDING OPTIONS** ❖ Hard cover ❖ Soft cover ❖ Perfect Bind ❖ Spiral bind ❖ Wiro bind & Comb Binding.

**64 (16), Thambiah Road, West Mambalam, Chennai - 600 033. INDIA**

**☎ : 044 2474 2091 / 2371 6322 ✆ : 98400 48491 E-mail : gotetigraphics@gmail.com**